# వాళ్ళు నలుగురు

## అంకితం - విశ్వనాథం ఆత్మకి

విశ్వనాథంగారి ఆత్మగారూ-

కథకోసం వాస్తవాన్ని మార్చినందుకు నన్ను క్షమించాలి. మీకు అంటగట్టిన అదృష్టానికి మీరు చాలా సంతోషిస్తారని నాకు తెలుసు, ఆ లోకంలో మీ నైతికాభిప్రాయలు తారుమారు కాకుండా వుంటే. కాని స్వర్గంలోని ప్రిన్సిపాల్ రామకృష్ణరావూ, కాశీనాథుని నాగేశ్వర్రావూ మొదలైన వారి సహవాసం లభించివుంటే, నా మీద మీకు దీనికి కోపం వొస్తుంది.

కాని ఎక్కడా మీ ఇంటా వొంటా అణుమాత్రమైనా లేని మిత్రవంచనని అంటగట్టానని చాలా నొచ్చుకుంటారు. మరి ఏం చెయ్యను?

**1947** పాఠక మహాశయులు ఊరుకోరు. చక్కని కథలు రాసే "చలం" బైరాగుల్లో చేరి రియాక్షనరీఐ తుక్కువేదాంతంరాస్తున్నాడంటున్నారు.

మీకు చాలా ఇష్టమూ, సునాయాసమూ ఐన పనిని మిత్రదోహంగా మీచేత చేయించానంటే, మళ్ళీ నా ప్రతిష్ట నెలబెట్టుకోడానికనీ మిమ్మల్ని నేను చేసిన బలి కన్న, కథకోసం, ప్రతిష్టకోసం, నా పరమ ఆప్తుడు సూర్యారావుని నేనెంత బలి చేసుకున్నానో మీరు గమనించారంటే మీ ఊర్ధ్వ ఆవరోహణపు విశాల దృష్టితో మీరు నన్ను క్షమిస్తారని తెలుసు.

**09-10-47** చలం

P. S. మద్రాసు రేడియోవారి కథలూ నాటకాలూ అక్కడికి వినబడవు కద! మీరు వాటిని వింటూ వుండడమే తటస్తిస్తే, యీ నా శ్రమ అంతా చాలా వృధా.

బళ్ళో పనికాగానే సాయంత్రం సూర్యారావు దొడ్లో చేరేవాళ్ళు నలుగురు టీచర్లూ - విశ్వనాథం, జాషువా, వెంకటసుబ్బయ్యా, సూర్యారావూ. ఆ వూరికి బదిలీ కాకముందు ఆ బడి హెడ్మాస్టరు వాళ్ళని రాత్రి తొమ్మిదింటికి వొదిలేవాడు. కారణం పనివుండి కాదు. పనిలేకపోవడం వల్ల. అంటే ఆ హెడ్మాస్టరుకి ఇంటిదగ్గిర పనిలేదు. పిల్లలులేరు. బంధువుల్ని అభిలాషతో చూడడు. ఆ భార్యకీ తనకీ మధ్య సంభాషణా, సంయోగమూ, వీటి పాసిబిలిటీస్ అన్నీ పూర్తిగా అంతమైనాయి. ఆమెకి బడి అంటే డబ్బు అని అర్థం. వంట అంటే ఈయనకి రుచి అని అర్థం. చీరెలూ, నగలూ, తన బంధువులతో రాకపోకలనే వాటిమీద

ఆసక్తిని ఆమెలోంచి మొదటి మూడేళ్ళలోనే వొదిలించాడు. కనక ఆయన మనో విజృంభణనీ, సంభాషణా చమత్కారాన్నీ భరించి, ఆమోదించేందుకు దిక్కుమాలిన టీచర్లు మాత్రమే మిగిలారు.

సూర్యారావు బళ్ళో చేరిన మొదటిరోజున నాలుగింటికి గంటకొట్టగానే, బైలుదేరాడు రోడ్డుమీదికి - ముందురోజు రైలులోంచి చూసిన జొన్నచేను జ్ఞాపకం తెచ్చుకుంటో.

"ఎక్కడికి?" అన్నాడు జాషువా.

"ఇంటికి" అనబోయి, ఇంకా తనకు ఇల్లులేదని జ్ఞాపకం వొచ్చి, "బైటికి" అని "మీరూ వొస్తారా?" అన్నాడు.

"కాఫీకా?"

"కాదు. నేను కాఫీ తాగను. బంగళాకిపోయి, అక్కణ్ణించి షికారు పోదాం."

ఎందుకంటే, నచ్చిన ఇల్లుదొరకక్క కులసత్తులు ఇల్లివ్వక, క్రిస్టియన్లు మహమ్మదీయులూ, ఇళ్ళుగలవాళ్ళు లేక, రెండు నెలలు రాదారి బంగళా, అది ఖాళీ చెయ్యాల్సి వచ్చినప్పుడు లోకల్ ఫండ్ సత్రం, మళ్ళీ ఖాళీకాగానే బంగాళా ఈ విధంగా గడిపాడు.

"అప్పుడే పోవడమేమిటి! వొప్పుకోడు ఆయన."

మర్నాడు సాయంత్రం పాపం, తరవాత హెడ్మాస్టరు ఒక్కడే కూచోవలసి వచ్చింది, తన ప్రజారహిత రాజ్యంలో, దిక్కులేక.

సాయంత్రం పూర్ణచంద్రుడు జొన్న చేలమీదా, పంట కాలువల మీదా ప్రకాశించ బోతున్నాడు.

"పచ్చన్ని సేలోకి-పండుయెన్నెల్లోకి-"

అంతవరకు సుబ్బారావుగారికి దడిశి దేవుడు కటాక్షిస్తాడు. తక్కింది మన అదృష్టాలమీద ఆధారపడి వుంటుంది - అనేప్పటికి ఆ ముగ్గురూ సూర్యారావుతో వచ్చేశారు.

ఆనాటినించి నలుగురూ విడవని జుట్టు ఐనారు. వాళ్ళకి సంసారాలున్నాయి! సూర్యారావుకి లేదు. అందుకని అతనికి డబ్బుంది. వాళ్ళకి లేదు. డబ్బుంటే భారంలేని సంసారాలు దొరకడం చాలా సులభం, సంసారాలు లేనివాళ్ళకి.

ఇది చదివే యువకులారా, గ్రహించండి.

సంసారాలువున్నా, అప్పుడప్పుడూ లేకండా చేసుకోకపోతే జీవితం చాలా ఉక్కిరి బిక్కిరి. భార్యకి గర్భం తెప్పించి పుట్టింటికి పంపడం చాలా సులువైన పద్ధతిగా తోస్తుంది. కాని త్వరలో మీరిచ్చిన గర్భభారం విడిపడి, ప్రత్యేక రూపాన్ని పొంది, తెల్లవార్లూ ఏడ్చి, మీ డబ్బుని మరింత తినేసే భూతంగా ప్రత్యక్షమౌతుంది.

రెండునెలల తరువాత ఎట్లాగో ఒక యిల్లు సంపాయించి పెట్టారు. అతని మిత్రులు, అతని గుణగణాల్నీ, శీలాన్నీ, అగ్రవర్ణపు పుటకనీ వూరివారికి చాలా ప్రత్యేకమైనభాగం. ఆ భాగం సందులో ఇంటివాళ్ళ గేదెని కట్టేసుకుంటారు. ఆ గేదెని సంరక్షించడానికి దానివల్ల సంరక్షణ పొందడానికి. ఆయింటి ఆమె సాద్రుశరూపవతి, ఎప్పుడూ వీళ్ళముందునించి పచార్లుచేస్తుంది. చురచురవాళ్ళ వంక చూసుకుంటో. ఆమెకి ఏమిటా బాధ అంటే పిల్లలులేరు. ఆ వూళ్లో అసలు పిల్లలులేరు. కంసుడు ఆ ప్రాంతాల రాజ్యం చేశాడో ఏమో, నీళ్ళలో కొంత వుందేమో ననిపిస్తుంది యీ జనాభామీద అధికారం. నూజివీడుగాని, ఏలూరుగాని వెడితే పుడతారని ఆమెకి యెవరు చెపుతారు? ఎందుకంటే ఏలూరు, నూజివీడు పట్నాలవల్లనే, పరస్పరం నరుక్కున్నా ఇండియాకి జనాభా తరుగుదల లేకపొయ్యే అదృష్టం పట్టిందనిపిస్తుంది.

మొత్తానికి ఆ వూరి జనాభా బైటవూళ్ళనించి భర్తీ కావలసిందేగాని ఆ వూరి పురుషుల ప్రభావల్లకాదు. మా యింటి ఆమెకి ఏలూరు సంగతి తెలీదు. ఆమె నడక తీరుచూస్తే యింతమంది పురుషులు మీసాలు మేలేసుకుంటో తిరుగుతో వుంటారు, ఒకరూ నా కొక్క బిడ్డను కటాక్షించరా, అని మండిపడుతున్నట్టు వుంటుంది. ఆమె అటు తిరుగుతో వుంటుందని గాలీ వెలుతురూ రాకపోయినాసరే, తలుపులు వేసుకోవాలని చూశారు. కాని వెంకటసుబ్బయ్య వప్పుకోలేదు.

"నన్ను చూసి, నాకన్నా చాలా సాత్వికమైన మొహం మీది అని నమ్మిస్తే వాళ్ళిల్లిచ్చారు. స్త్రీ అనేది ఈ గదుల్లోకి రాదని, ఆమెనీ, రౌడీలు రారని, ఆయననీ నమ్మించి మీకు ఇల్లిప్పించాను. తలుపులు వేసుకుంటే అనుమానిస్తారు. వీల్లే"దన్నాడు.

సూర్యారావుకి భయమేసింది.

"ఏం చెప్పారేమిటి నా సంగతి?" అన్నాడు.

"చాలా మంచివారని, చాలా పొగిడాను."

"ఏమని?"

"ఏం లేదు. మీకు స్త్రీ వాంఛ లేదని."

"చూశారా? చూశారా?" అన్నాడు టీ తాగుతున్న మిత్రులతో-

"అవును. మీకు స్త్రీలతో నేం పని?"

"మరి యింక జీవితంలో నాకేం పని?" అని. "కాని ఆ మూలకిళ్ళీ దుకాణాన్ని అనుకు నుంచుంటుంది, మన యింటివెనక. ఆమెని పాచిపనికి కుదుర్చుకున్నాను" అన్నాడు సూర్యారావు.

"ఆమె పని చెయ్యదే!"

"చేస్తానంది."

"మరి ఆ కిళ్ళీకొట్టు అతన్ని చూశారా?"

"చూశాను....ఐనా పనికి కుదిరింది, అతని అనుమతిమీదనే."

"బహుశా యీ యింటి ఆయనతో వెంకటసుబ్బయ్య అన్నమాట అతనికి తెలిసి వుంటుంది మీ సంగతి."

"చూశారా! మీకు స్త్రీ వాంఛలేదనే నా ప్రచారం ఎట్లా ఉపయోగపడుతోందో!" అన్నాడు వెంటకసుబ్బయ్య.

ఇల్లు కుదిరినప్పణ్ణించి - పొద్దున్నే ఆ ముగ్గురూ వొస్తారు అతని ఇంటికి. "స్టౌ" వెలిగించి నీళ్ళు పెడతారు. నలుగురూ చుట్టూ చేరి, ఒక పెద్ద పాట్‌నిండా టీ తయారుచేసి కప్పుల్లో పోసుకుంటో, సిగరెట్లు కాల్చుకుంటో తొమ్మిదింటివరకు, మధ్య మధ్య బావినించి నీళ్ళుతెచ్చే గౌరితో హాస్యాలాడుతో, ఇటూ అటూ దూకుడుగా గేదెదగ్గిరికి నడిచే ఆ యింటిఆమె చూపులు తప్పుకుంటో.

గౌరివల్ల తలుపులు ముయ్యడానికి అసలు అభ్యంతరం అయిపోయింది.

భోజనం. బడి.

మళ్ళీ ఒంటిగంటకి ఇంటికి పరుగు. పనిలేకండానే ఆ వేళకి గౌరి వొచ్చేది పక్క కిళ్ళీ కొట్టులోంచి. మళ్ళీ టీ, సిగరెట్లు. కొన్నాళ్ళకీ ఇల్లు గౌరికే వొప్పచెప్పారు. వాళ్ళున్నంత సేపట్లో ఆమెకి నీళ్లు తేవడానికీ, అతని బట్టలు ఆరెయ్యడానికి వ్యవధే లేకపోయేది గౌరికి, వాళ్ళు టీ తాగుతున్నంతసేపూ యింటి ఆమెకి కనపడకండా మూలల తిరుగుతో, బడికి వెళ్ళేప్పుడూ వొచ్చేప్పుడూ కిళ్ళీకొట్టు ఆయనమీద కన్ను ఉంచనే వుంచాడు, టెంపచేచర్ ఎట్లా వుందోనని సూర్యారావు. కొద్దికాలంలోనే, కొట్టుమీదనుంచి దూకి నిలబడి నమస్కారం పెడుతున్నాడు అతనికి. సాయంత్రం నాలుగింటికి బడినించి మళ్ళీ యింటికి, మళ్ళీ టీ, షికారు.

ఆ సాయంత్రం మాత్రం అతనికి తలనొప్పిగా ఉండడం చాత, విధి లేక ఆగాల్సి వచ్చింది యింటిదగ్గిర. కాని అందరి మనసులూ జొన్న పొలాలమీదనే ఉన్నాయి. అసలు ఆ వూరి జొన్న పొలాలకి ప్రత్యేకంగా అందం, వాటి నానుకుని ఉన్న నీలం కొండవల్ల. అంతేకాక తక్కినపాట పూర్తి అయ్యేట్టుంది. ఎందుకంటే నీటుగా ఉన్నదో లేదోగాని, ఆ జొన్న మొక్కల మధ్యనించి నీలిచీరె ప్రతి సాయంత్రం వాళ్ళకి వయ్యారి మొలికిస్తో దగ్గిరిగా జరుగుతోంది. ఒకటి రెండు జవాబుల స్థితికి వచ్చింది. పాపం డిజప్పాయింటు అవుతుందిగావును.

"పోనీ, మీరు ముగ్గురూ వెళ్ళండి" అన్నాడు దొడ్లో పడకకుర్చీలో పక్కకి తల వెళ్ళాడేసిన సూర్యారావు. వాళ్ళు ముగ్గురూ చాపమీద కూచున్నారు.

"అమ్మా! మేం వెళ్ళం" అన్నాడు సాధారణంగా మాట్లాడని జాషువా.

"ఏం"

"తెలీదనుకోకండి" అని చిరునవ్వుతో సిగ్గుగా మా కెదురుగా ఉన్న డాబాకేసి కనుకొలుకుల్లోంచి చూశాడు.

ఆ డాబామీద కళ్ళకిందవరకూ ఓతల కనబడుతోంది. ప్రత్యేకంగా నవ్వుతున్నాయి. కళ్ళపైన పచ్చటినుదురు మబ్బుల్లోకి ఉదయించే చంద్రుడి పై భాగంమల్లే. ఆ నుదుటిమీద మెలికలు తిరిగిన జుట్టు. ఆ మెలికలపైన నిగనిగలాడే తల. ఎవరితోనో నవ్వుతోంది. కిందికి వంగింది. మళ్ళీ నుంచున్నప్పుడు వాళ్ళకి పక్కగా కనిపించింది. మెడమీదికి ముడి-గొప్పముడి. సూర్యారావు కంటో స్త్రీ జుట్టు అమర్చుకోడానికి రెండే అందాలు-సవరంలేని భారీజడ, మెడమీదికి జారే వేలుముడి, తక్కిన తలలన్నీ బాబ్ చెయ్యవలసిందే. అంతకీ అందం రాకపోతే క్రాప్ చేయించాలి. అంతకీ ఆందం కాకపోతే బురఖాలోకి వెళ్ళాలి.

నవ్వుతోనే పిట్టగోడ దగ్గిరికి వచ్చింది. కళ్ళకీ, జుట్టుకీ, మెడకీ ఉన్న అందాన్ని, సూర్యారావు దురదృష్టవంల్ల అక్కడ ఆపక, నడుంవరకూ బుద్ధిగానే పనిచేశాడు బ్రహ్మ. అంతవరకు అందంగా ఉంటే. తక్కిందంతా అందమన్నమాటే. అందెలూ కడియాలూ చెరచకపోతే.

ఆమెని చూడగానే ఎక్కడో ఎప్పుడో బాగా దగ్గిరగా చాలా స్నేహంగా యిట్లాంటి ఆమెని ఎరుగుదునని గట్టిగా తట్టింది అతనికి. కాని ఎంత వెతికినా రాలేదు మనసుకి. కొంతవరకు బోర్డింగు విమల జ్ఞాపకం వచ్చింది. కాని కాదు. తరవాత ఎన్నో వారాలకి ఆమె శబ్దం లేకండా వాళ్ళ మీద "ఈ వియోగజలధి...." అని పెదవుల కదలికతో పాడినప్పుడు తెలిసింది. అతనికి పరిచితురాలు స్త్రీ కాదుగనుక ఇన్నాళ్ళూ జ్ఞాపకం రాలేదని.

ఆమె, స్థానం నరసింహారావుగారి "సత్యభామ" అన్నీ అతని కులుకులే-వొయ్యారాలే...నాజూకులే-ఆ కళ్ళు తప్ప- ఈమె కళ్ళు చాలా గొప్పవి. స్థానం నటించే భావాలు ఈమె కళ్ళకి సహజం. ఆమె కళ్ళ అసలు ఆకారం వర్ణనకు తెనాలి రామకృష్ణుడు పూనుకోవలసిందే. ఇంక ఏ తెనాలి మనుషులూ పనికిరారు. ఆ డాబా నాటకంలో తెనాలి నించి వాళ్ళని చూడొచ్చిన సాంబం మామయ్యకి స్త్రీలో కళ్ళ అందాలు పట్టవు. సుబ్బారావు, ఆమె కళ్ళనికన్న ఆ కళ్ళ చూపులకింద సూర్యారావు కళ్ళే మొౌతున్నాయో ఎక్కువ శ్రద్ధతో చూస్తోవుంటాడు.

వాళ్ళ నలుగురినీ చూసికూడా ఆమె తన నవ్వుని మార్చుకోలేదు. తన మిత్రుల్ని పలకరించినట్టే అంగీకారంతో చూసింది వాళ్ళవంక. అట్లానేనుంచుంది. వాళ్ళట్లానే కూచున్నారు. ఆమె అదరంకింద పొంగిపోతో, ఒక్క గొప్ప చిరునవ్వుతో వెళ్ళిపోయింది.

"ఏమేనా?" అని ఒకరి మొహం ఒకరు చూచుకున్నారు వాళ్ళు.

ఆ మరునాటినుంచీ "నీలిచీరె"కి స్వస్తిచెప్పారు. ప్రతి సాయంత్రం ఆ దొడ్లో చేరేవాళ్ళు, నలుగురూ-ఆ రంగుల చాపమీద. గౌరిని "సాయంత్రాలు పనిలేదు రావ్దూ"న్నారు, దీపం వెలిగించడానికికూడా. పాపం, హొటలునించి అతను వచ్చింతరువాత పక్కవేసి, నీళ్ళ కూజా పక్కదగ్గిర పెట్టేప్పుడుకూడా ఆమె చమత్కారపు సంభాషణకి సూర్యారావు నించి పరధ్యానంగా వచ్చేవి జవాబులు. గౌరి మొహం చిన్నబోయింది.

సాయంత్రం నాలుగు గంటలకే ఆమెకూడా ఆ డాబా చివర హాజరు. ఒకవేళ ఏ రాత్రైనా, చంద్రోయదం కాకుండా పోతుందేమోనని అనుమానించవచ్చునుగాని, ఆమెముఖ చంద్రోదయాన్ని సందేహించ నక్కర్లేదు. చీకట్లోనో, వెన్నెలలోనో, ముఖాలు కరిగిపొయ్యే వరకూ ఆమె ఆ డాబా మీదనించి వాళ్ళది, తరవాత ఆమె ఎవరిదో వాళ్ళకి తెలీనూ తెలీదు. వాళ్లకి గట్టిగా ఆ సంగతి పట్టనూపట్టలేదు. ఒక్కొక్కరోజు చీకటైనా కూడా ఆమె అక్కడ వున్నదనిపించేది. ఆమెకి వినపడేట్టు వీళ్ళు గోడ అవతల రోడ్డుమీద పాదచారులకి అర్థంకాకుండా, ఆమెకే అర్థమయ్యేట్టు సాకేతికంగా మాట్లాడుకొనేవాళ్ళు. కథలు చెప్పుకునేవాళ్ళు. "అనగనగా ఓ రాజకుమార్తె. ఆమె అతి సౌందర్యవతి. ఆమె డాబాలమీద విహరించేది. ఆమె కళ్లని వర్ణించడానికి అలివికాదు.

ఆమె కన్నులలో ననంతాంబరంపు నీలినీడలు కలవు.

....................................

అర్థమ్ము కాని

భావగీతమ్ములవి.

ఆమెని చూసినవాళ్ళు ఆమెని ప్రేమించకండా వుండలేరు"-ఇట్లా చెప్పుకునే వాళ్ళు.

ఆమె కనపడకపోయినా. ఆమె వెళ్ళగానే, ఆమెవదిలి వెళ్ళిన శూన్యం వాళ్లకి తెలిసేది.

"ఎంకివంటిపిల్ల లేదోయ్ లేదోయ్"

....................................

కళ్ళెత్తితే చాలు కనకాభిసేకాలు"

అని పాడేవాళ్లు జాషువాకూడా పాడేవాడు. అతని పాటవిని, పాపం, ఆగేదె పోదామని ఒకటే గుంజుకొనేది.

ఒక్కొక్కప్పుడు ఆమె కదిలేదేకాదు. వీళ్ళే వెళ్ళవలసివచ్చేది. ఆమెని చీకటి వొంటరితనానికి వదిలి, పాలు తియ్యడానికి గేదెదగ్గిరికి వాళ్లని దాటివెళ్ళే ఇంటిఆమె వాతావరణానికి దడిసి వాళ్ళు అక్కణ్ణించి కదిలితేనేగాని. ఆమె పాలు పితకడం ఆపదు. పాపం, నోరులేని దూడమీద జాలివలనన్నా వాళ్ళువాళ్ల డాబా కన్యకి ద్రోహం చెయ్యవలసిన

వాళ్లయ్యారు. చూశారా, మనుషుల అదృష్టాలు జంతువుల ఆకళ్ళకి ఎంత పెనవేసుకొని వుంటాయో! అందువల్లనే టూగూరుగారు గడ్డిలోని రసమే తన నాళాల్లో విజృంభిస్తోందన్నారు. మరి గేదె గరికని తినదా!

మొదట కొన్ని సాయంత్రాలు అట్లా వాళ్లవంక కాకుండా చూస్తూనుంచోడం, మెరుపు చూపులుచూసి తల తిప్పేసుకోడం. వాళ్ళు అక్కడ వున్నట్లుచూసి సంతుష్టిచెందిన అంగీకారం. తరవాత చిరునవ్వులు.

ఓ ఉదయానికి విశ్వనాథం ఆమె ఉదంతం తీసుకొచ్చాడు. ఆఇంటో ఓ ప్లీడరు కాపరం. ఈమె అతని మరదలు. ఈమె భర్త లా కాలేజీలో చదువుతున్నాడు. ఈమెని చూస్తే ఆ యింటికంతా ముద్దు.

పదిరోజులు గడిచింది. ఈలోపున ఆమె ఒక చిన్నపిల్లని సంపాయించింది. ఆ పిల్లతో నవ్వులు, ఆటలు, ఆ పిల్ల నెత్తుకుని, బళ్లనీ, కాకుల్నీ, వీళ్లనీ, గేదెనీ ఆపిల్లకి చూపడం, పకపక నవ్వడం, ఏమనుకోకండి అన్నట్లు వాళ్ళవంక చూడడం.

వాళ్లేం చేస్తున్నారా? వెనక శారదాకాశం. ఒక తాటిచెట్టుకొన, వేపచెట్టు చివర్లు, ముందు ఈ కన్య, నవ్వులు, నడుం విరుపులు, దేహంలోంచి ఆ వ్యక్తి ఆహ్వానాలు, ఆశలు, సూచనలు, కంటి అల్లరులు, జుట్టు తళ తళలు, నడుము ఒంపులు, చేతుల నున్నతనపు రంగులు, జాకెట్టు రహస్యాలు, ఇవన్నీ గమనిస్తో, నాటకం చూస్తున్నట్లు, అస్తమించే సూర్యుడు ఆమెపైని వన్నె మెరుపులూ, క్రమంగా ఆమెలో ఛాయలూ చూస్తూ ముద్దులై కూచున్నారు. మర్నాడు పొద్దున్న అంతా అవే మాటలు.

పది రోజుల తరవాత గావును ఓ ఉదయం టీ ముందు వాళ్ళ మనసులు నాలికలద్వారా పనిచెయ్యడం ప్రారంభించాయి.

"ఇంతేనా ఎప్పుడూ?" అన్నాడు విశ్వనాథం.

"ఏం. చాలదా!" అన్నాడు జాషువా.

"ఇంతవరకు చాలుననే అనిపించింది. కాని ఇదంతా దేనికో గాఢమైన దానికి ప్రస్తావనగా కాకండా, దాని కదే అంతమని అందమని ఆగడం చాలా కష్టం. అర్థహీనంగా కనపడుతుంది" అన్నాడు సూర్యారావు.

"అడిగితేనే వివేకం" అన్నాడు వెంకటసుబ్బయ్య.

"వుండండి, ఈ సాయింత్రం చూద్దాం." అన్నాడు సూర్యారావు.

సాయింత్రం ఆమె చూస్తుండగా అతను చేతిని పెదవుల దగ్గిర పెట్టుకున్నాడు. అతని సాహసానికి భయపడ్డారు మిత్రులు. అంతే కాదు, ఈ సుందర దృశ్యంలో యీ అవకతవక ఏమిటన్నట్టు చిరాకు పడ్డారు, ఆమె ఇంక కనపడకపోతే, అతని ధూర్తత్వ

కారణంగా? మొత్తానికి ఆమెని ఓ దృశ్యంగా, ఒక దేవత సుందరరూపంగా మాత్రమే చూడ్డం అలవాటయింది వాళ్ళ మనసులకి.

అతను చేసిన పని చూసి ఆమెకూడా చప్పున జంకినట్టయింది. ఓ నిమిషం తరువాత కళ్ళు నవ్వాయి. మెల్లిగా ఆమెవేళ్ళు పమిటమీదనించి కంఠం కిందికి, తరవాత చంపమీదికి, నవ్వే ఆ పెదవులమీదికీ పాకాయి. అక్కడే నిలిచాయి. ఎంత గొప్ప సంతోషం అతని రక్తంలోంచి అణక్క అతని కళ్లు తిప్పిందో తలుచుకోలేము. అట్లాంటి అనుభవం కోసం....ఏమియ్యరు? ఏదో గొప్ప అందమైన శిలావిగ్రహం, పటం, దేవత అతని పిలుపుకి ఎదురు పలికినట్టయింది. సంతోషం ఆగక విశ్వనాథం సూర్యారావు వీపుమీద పెడీలుమని కొట్టాడు. అదేదో లోకంలో విహరించే ఆ సూర్యారావు అదిరి వెనక్కి చూశాడు, డాబామీద సుందరి నవ్వుతో వెనక్కి విరుచుకుపడ్డది.

ఆ వొక్క ఇచ్చి పుచ్చుకోడాలతో వాళ్ళ మధ్య గట్లు తెగిపోయినాయి చాలా గొప్ప స్నేహితులైనారు. ఒక్క మూడు రోజుల్లో వాళ్ళు నలుగురూ మూతులుమీద చేతులు వేసుకోడం, చేతుల్ని రొమ్ముమీద బిగించుకున్నట్టు కావిలించుకోడం, చేతులతో రమ్మనీ, దూకమనీ, పైకి ఎగరమనీ పిలుచుకోడం, పక పకా నవ్వుకోడం చాలా సులభమై పోయింది దొట్లోంచి వాళ్లెవరికీ కనపడరు. రోడ్డుమీద యెవరన్నా వస్తోవుంటే, ఆమె వాళ్ళకి ముద్దుల్విడం ప్రారంభించింది- డాబామీదనించి, ఎంత సాధనచేసినా వాళ్ళ మూతులు ఆర అంగుళంకన్న ముందుకు సాగలేదు. ఆమె ఒక్క ముద్దుకు వాళ్ళనించి నాలుగు ముద్దులు వెళ్ళేవి గాలిలోకి.

ఇంకో రోజున ఆ పిల్లని తీసుకొచ్చి వాళ్ళవంక చూస్తూ గట్టిగా కావిలించుకుంది. దీనికి ప్రత్యుత్తరం ఎట్లాగా అని సూర్యారావు ఆలోచిస్తో ఉండగానే, విశ్వనాథం అతన్ని గట్టిగా కావిలించుకొని ముద్దు పెట్టుకొన్నాడు. ఆమె నవ్వు ఆపుకోలేక పిల్లతో సహా పిట్టగోడమీద పడ్డది. సూర్యారావు ఎర్రటి మొహంతో బుగ్గ తుడుచుకుంటో బావి దగ్గిరికి పోయినాడు.

ఎందుకంటే, విశ్వనాథాన్ని చూసివుంటే, అర్థమౌతుంది. అతని వొళ్ళు రంగులో, గట్టిలో ఇనుము. ముక్కుకి పోగు. చుట్టా సిగరెట్లు మొదలైనవి - అందులో చవకవి - అమితంగా కాల్చిన పెదమలు. ఆడవాళ్ళకి చాలామందికి తానిష్టమంటాడు. అతను అబద్ధమాడడు. ఆడవాళ్ళకి విచిత్రమైన యిష్టాలు. వాళ్ళు ఇష్టపడ్డ మొగవాడు తప్ప, తక్కిన మొగవాళ్ళు ఏమైనా అర్థం చేసుకోలేని ఇష్టాలు వాళ్ళవి. తప్పకండా ఇష్టపడి విశ్వనాథాన్ని తీసుకోనూవచ్చు. ఆడవాళ్ళు ఆ పెదిమలతో ముద్దులు పెట్టించుకోనూవచ్చు. ఆ ఇనుంలో మెత్తదనం వెతకనూవచ్చు. సూర్యారావుకేం అభ్యంతరం లేదు. కాని ఆకస్మికంగా, ఏ రసికవంతమైన ప్రయోజానానికైనా సరే, ఆ సమయంలో ఎంత తప్పనిసరి ఐనాసరే, ఆమెముందు అపజయాన్ని, అవమానాన్ని తప్పించుకునేందుకైనా సరే, తనని

సాధనంచేసుకుంటానంటే అతను వప్పుకోడు. తక్కిన రోజులన్నీ ఆమె ముందు విశ్వనాధానికి దూరంగానే వర్తించాడు.

కాని వాళ్ళ ఉత్సాహానికి పరిమితిలేదు. సూర్యారావు దిండు తెచ్చుకున్నాడు సరసాలాడడానికి. విశ్వనాధం తన మోకాలునే తన ప్రియురాలిగా చేసుకున్నాడు. వెంకటసుబ్బయ్య, అంతదూరం రాదలుచుకోలేదు. జాషువా తన కళ్ళతోటే తంటాలు పడ్డాడు.

ఓ సాయింత్రం వాళ్ళ ప్రియురాలు నాట్యం ప్రారంభించింది. గోడ దగ్గిరికి వచ్చి "ఈ వియోగ జలధి" పాడింది, శబ్దం లేకండా. అప్పుడే సత్యభామ పోలిక తట్టింది సూర్యారావుకి స్త్రానం నాటకాల్ని బాగాచూసింది గావును విరహం, ప్రియుడు వచ్చినట్టు తన సంతోషం, లాలన, ముద్దు, ప్రణయకోపం, అనురాగం, కళ్ళతో, ఒంటితో చేతుల్తో అద్భుతంగా ప్రదర్శించింది, వాళ్ళపైన. వాళ్ళని చూసీ వాళ్ళని తనలోకి తీసుకున్నట్టు అభినయించింది. వాళ్ళకి వెర్రెక్కి పోయింది. నిజంగా ఆమెని కలుసుకో గలిగిన క్షణాన-గాలిలో ఇన్ని చూపగల జాణ, రసికురాలు ఆమె తనకి ఏం ఇయ్యలేదు? ఎవడబ్బా యీమెని వాళ్ళకి వదిలి పరీక్షలకి చదివే దౌర్భాగ్యుడు!

అదే మర్నాడు ఉదయం వాళ్ళల్లో ప్రశ్న. ఎట్లా కలుసుకోడం? కలలోంచి దృశ్యంలోంచి వాస్తవ జీవితంలోకి దిగేప్పటికల్లా - ఎవరు కలుసుకోడం? నలుగురూ? అనే విషపుతలపు అందరి మనసుల్లోకీ వచ్చింది నలుగురూనా, కాకపోతే ఎవరు వాళ్ళలో? దమయంతో, ద్రౌపతో తీర్చవలసిందే ఆ సమస్యని! కాని అదృష్టమేమిటంటే వాళ్ళలో ఎవరికీలేదు ఆ అదృష్టం. ఆ డాబాకీ, దొడ్డికీ మధ్యవున్న పదిగజాల దూరంలో, సప్తసముద్రాలూ, మర్యాదలూ, హిమాలయాలూ, భయాలూ, ఆటంకం, దాటరానివి, మీరరానివి.

"మనలో ఆమెకి ఎవరు కావాలి?"

"అసలు కావాలా అని?"

ఆగారు. నిజమే. అసలు కావాలా?

"అందరం కావాలేమో?"

ఎందుకంటే వాళ్ళ నలుగురిలో ఆమె ఎన్నడూ ఏ పక్షపాతమూ చూపలేదు.

వెన్నెలవలె, పువ్వులవలె వెదజల్లుతోంది శృంగారాన్ని. ఎవరు ఏరుకుంటే, అనుభవిస్తే, ఎవరికి కళ్ళుంటే, రసిక హృదయం, సౌందర్యభావంవుంటే వారికీ ఆ వరాలు. అవును. ఆకాశానా, కొమ్మల్లోనూ ఉన్నంతసేపే వెన్నెలకీ, పువ్వులకీ సర్వసమత్వం. చంద్రుడు భూమికి దిగనీ, పువ్వులు చేతికందనీ, ప్రతివారూ ఎగబడతారు. ప్రత్యేకం తమ గదిలోకనీ, ప్రత్యేకం తమ తలలోకనీ, వొళ్ళోకనీ.

ఆ చందమామ దిగదా? దిగకపోతే యీ వెన్నెల అందమే తగ్గుతుంది. ఏనాడో యీ శృంగార జ్యోత్స్న కళ్ళకేకాక, వక్షాలకి, తొడలకి, పెదిమలకి, రక్తానికి చల్లదనమిస్తుందనే ఆశే అంత తీపి, అందం వలపు, అంత ఆకర్షణ - అన్ని సాయింత్రాలు వాళ్ళని కట్టేసింది. దిగాలి చందమామ. కాని ఎవరి చేతుల్లోకి? అనేది ప్రశ్న.

"ఎవరికోసం ఆ లాలనలు, ఆ మూర్ఛనలు?"

"ఎవరికోసమూ కాదు, తన వినోదార్థం!"

"మనం?"

"ప్రేక్షకులం."

"అంత అందాన్ని, గొప్ప నాట్యాల్ని, ఏ టిక్కెట్టూ కొనకండా ఇన్ని సాయింత్రాలు చూసి, పైగా ఏడుపు."

"కాని ఎవరికోసం?"

"రసిక ప్రపంచానికి. మనం ఉత్తచిన్హాలము. అంతే."

అట్లా నిలిచి తృప్తిపడి ఆగిపొయ్యే వాళ్ళేనేమో. ఇంతలో తెనాలి నుంచి సుబ్బారావూ, సాంబం మామయ్యా వచ్చారు. సూర్యారావు అతిథులుగా.

ఆ సాయింత్రంనించి ఆగ్రరయ్యారు. నిండిన హాలునిచూసిన నర్తకికి ఉత్సాహం వచ్చింది. ఆ ప్రియురాలికి. ఒకసారి సాంబం మామయ్య పట్టలేక "భేష్, భేష్" అని అరిచాడు. కాని సాంబం మామయ్య రాకతో, ఆ కల ఇంద్రజాలం విడిపోతున్నట్టనిపించింది వాళ్ళకి. కాని సాంబం మామయ్యని ఎట్లా పొమ్మంటారు? పొమ్మన్నా పోడు మామయ్య, తనకి న్యాయంగా తోస్తేనే తప్ప - రెండురోజులు చూశాడు. ఆ సాయింత్రం, చప్పున.

"నాన్‌సెన్సు. ఒరే సుబ్బారావ్. లేచిరారా" అని సుబ్బారావుని కూడా తీసుకుని వెళ్ళిపోయి నాడు. దాంతో వాళ్లమీద బిందెడు చన్నీళ్లు పోసినట్టయింది వాళ్ళ ప్రాణం.

సాయింత్రం వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకున్నారో ఏమో. రాత్రి పడుకున్న.తరవాత, చప్పున లేచి కూచుని-

"ఏమిటి ఇదంతా?" అన్నాడు సాంబం మామయ్య ? ఏం చెపుతాడు సూర్యారావు!

అతని ఘుందు తాటాకు బొమ్మలతో ఆడుకునే ఆడపిల్లమల్లే ఐనాడు.

"ఏంరా? ఏం బాగాలేదా?" అన్నాడు సుబ్బారావు.

"ఒరే నోరు ముయ్యి. వాళ్ళకి మతిపోతే, నీకూ పోయిందిరా ! నలుగురు బుద్ధిగల పెద్దమనుషులు పనీపాటమాని...... ఎన్నాళ్ళనించి ఈ నాటకం!"

"నెలపైగాట."

చీకట్లో నవ్వుతున్నాడా సుబ్బారావు?

"అదో ఆడదా ? దానికి సిగ్గూ బుద్ధీలేవూ ? అది వళ్ళు విడిచి తైతక్కలాడితే వీళ్ళు చొంగలు కారుస్తో ఇక్కడ కూచుని చూడడమా ? ఛీ, నాన్‌సెన్స్!"

"ఈ నీతి ధోరణిలో ఎప్పణ్ణించి పడ్డావు నువ్వు!" అన్నాడు సుబ్బారావు.

"నీతేమిట్రా! నీతి సంగతేముంది దీంటో! వందయేళ్ళు అట్లా కూచున్నా నీతికేం భంగంలేదు వీళ్ళలో ఎవరికీ. అదే నా అసహ్యం. ఏదో చేస్తే ఏమన్నా చెయ్యాలి. లేకపోతే లేచిపోవాలి, నేను చెపుతున్నాను చూడు. ఎన్నియేళ్లు వీళ్ళిక్కడ తపస్సు చెయ్యనీ, ఆ ముండ ఆ డాబా మీదనించి ఒక్క మెట్టు దిగదు. వీళ్లు ఒక్క మెట్టు ఎక్కరు. ఇది అమానుషంరా. అధమపౌరుషం. అదో ఆడదీ, వీళ్లో మొగాళ్ళూ! అందులో నలుగురు.....ఇంతంత మీసాలు పెరిగి...."

బూతుల్లోకి వెళ్ళాడు మామయ్య. బూతులు మాట్లాడడు. మాట్లాడితే సరైన స్థలంలో సరిగ్గా న్యాయమైన బూతులువేస్తాడనిపిస్తుంది. అందుకనే అవి బూతుల్లాగ కనిపించవు. అదిగాక మామయ్యకి సెంటిమెంటు అంటే మంట. జీవితమంతా అతని అంకెలు ఎగ్జాక్టుగా (exactగా) వుండాలి. చేతులో స్పష్టంగా కనపడాలి.

కాని మన కధకుడి సంగతి తెలుసుగా నీకు! వుత్తరొమాంటిస్టు. అతనికి ప్రతి స్త్రీ వీపువెనకా రెక్కలు కనపడతాయి. చీకు పెదవుల్లో అమృతం రుచిః జుట్టు చుట్టూ తేజస్సు.....

"అది ఔన్నత్యం కావొచ్చు? కవిత్వం కావొచ్చు, కాని జీవితంలో ఏమి కూడని పని. మీ సూర్యారావుకైనా సరే,"

"ఏది!"

"ఆడవాళ్ళకి రెక్కలు పెట్టడం."

"ఏం?"

"ప్రేమించే పురుషుడు స్త్రీకి రెక్కలు పెడితే ఎగరాలని చూస్తుంది. కాని ఎగరలేదు - మొత్తానికి ఈనాటి ప్రపంచంలో."

"ఎగరనిమ్మంటాడు ఇతను."

"ఎక్కడికో ఎగరదు, అతని బుజాలమీదికే ఎగిరి కూచుంటుంది. ఏనాడో అతను ఆమెని కిందికి పడతోయవలసిన అవసరం కలిగి తీరుతుంది. ఎందుకంటే స్త్రీని బుజాలమీద మోసే పురుషుడు చాలా అధమస్తితిలో పడతాడు. ఆ కిందికి తోసినవాడు ఆమె నడుమూ విరగవొచ్చు, ఈ లోపల ఇతని బుజాలు వొంకరపోనూ వొచ్చు. ఆ గూనివాడింకేం చేస్తాడు?'

ప్రస్తుతం ప్రపంచంలో మొగవాడిది ఆధిక్యత."

"అదేగా కూడదని తగాదా మన వీరుడు" అన్నాడు సుబ్బారావు.

"తగాదా చెయ్యనీ. కాని అదేదో సిద్ధించినట్టూ స్త్రీ పురుషుడికంటె అధికురాలైనట్టూ తనని తాను మోసపుచ్చుకుంటే ఆ స్త్రీ కూడా మోసం చేస్తుంది. ఇతని సంగతేకాదు, మరి ఇతని బోధనలు నమ్మో, లేక వాళ్ళే అదే గొప్ప అనుకుంటారో, చాలామంది యువకులు ప్రయత్నిస్తున్నారు. ప్రేయసుల్ని బుజాలపైన కూచో పెట్టుకోవాలని. కాని చాలామంది ఈనాటి యువకులకి బుజాలే లేవు. అందుకని ప్రేయసులు వాళ్ళంతట వాళ్ళే కిందికి జారిపోతున్నారు" అని నవ్వాడు సాంబం మామయ్య.

పకపకా నవ్వాడు సుబ్బారావుకూడా. సూర్యారావు పిచ్చిపోకడల నన్నిటీని మింగగల అపారమైన ప్రేమగల సుబ్బారావు. సూర్యారావు ప్రవర్తననీ, కావాల్నీ తనకీ, ప్రపంచానికీ ఎక్స్పోజ్ చేసుకోడానికి బ్లఫ్ వల్ల సాధించే సుబ్బారావు.

మళ్లీ అంటున్నాడు సాంబం మామయ్య.

"ఇతను సరేలే, ఆ ముగ్గురికీ ఏం పుట్టింది? ఇతనైతే మాత్రం ? మనకంటె విశేషాలే కనపడవొచ్చు. ఆ విశేషాలన్నీటితోకూడా పక్కలోకి రావాలంటాడా లేదా? పోరా, నాకు తెలియనట్టు మాట్లాడకు ఈ కవుల సంగతి. రెక్కలూ, కిరణాలూ, అమృతాలూ ఎన్నిరాసినా, ధ్యానించినా, పర్యవసానం పిర్రలూ, కాళ్ళూ....పొద్దున్నే ఇడ్లీ కాఫీ, ఏంలేదురా, వీళ్ళకి అంతకన్న చాతగాక, ఏం చెయ్యడానికీ బలమూ, మార్గమూలేక, వొదలలేక, నక్కల్లాగు కూచుని, మోరలు జాచి కుయ్ కుయ్ మంటున్నారు. కవిత్వమంతా అంతేకదూ! తనకి కావలసిన ఆడది దొరికి, తనకీ ఆమెకీ తృప్తి అయ్యేట్టు అందరిమల్లే అనుభవించేవాడు కథలూ కవిత్వాలూ ఎందుకు రాస్తాడురా, వీళ్ళందరూ సెక్స్యువల్ పర్వర్ట్స్ (Sexual perverts) రొమాంటిక్ లునటిక్స్ (romantic lunatics)"

"మనవాణ్ణికూడా అట్లా అంటే ఎట్లారా?" అన్నాడు సుబ్బారావు.

"ఇదుగో ఆ సెన్టిమెంటే వొద్దంటా."

అంటున్నాడు సాంబం మామయ్య? మూడూ నాలుగూ ఏడనకండా అరున్నొకటి అంటే మండిపడే మామయ్య.

"ఆ సెంటిమెంటే వద్దంటా. కథలూ, కావ్యాలు అట్టేపెట్టు, అదెదో కీర్తికోసమో, డబ్బుకోసమో ఏడుస్తారు. ఈ పనేమిటి చెప్పు, ఒకరోజుకాదు, రెండు రోజులుకాదు. నెలపైగాట."

"మరి ఏం చెయ్యమంటావు?" అన్నాడు సూర్యారావు.

"ఏం చెయ్యాలా? అడుగుతున్నాడు. బిగ్గిరిగా కేకెయ్యి రేపు సాయింత్రం-"ఒసే. ఏమిటే వెధవ వేషం? రాత్రికీ వస్తావా, రావా? రావా. ఇంక కనపడకపో. కిందికిపో. పోవా డాబామీదికివచ్చి తంతాను. జాగ్రత్త" అను."

"కాని నలుగురు" అని నవ్వాడు సుబ్బారావు.

"ఆరుగురం" అన్నాడు మామయ్య.

"పోనీ సాయంత్రాలు హాయిగా కాలక్షేపం అవుతోంది. అంతకన్న ఏం చెయ్యను ఈ వూళ్లో!"

"ట్రిగ్నామెట్రీ నేర్పుతాను రండి."

"ఎందుకు మాకు ట్రిగ్నా మెట్రీ?"

"ఎందుకన్నా పనికొస్తుంది. ఇదెందుకంట? ఇదుగో ఇప్పుడే చెపుతున్నాను. రేపు సాయంత్రం మీరక్కడ చేరారా, అందర్నీ కలిపితంతాను. దానిమీద నాలుగురాళ్ళు విసిరికొడతాను, ఇప్పుడే చెపుతున్నా. ఇంక నిద్రపొండి" అని ముసుకు పెట్టుకున్నాడు.

రాత్రంతా దిగులుపడుతున్నాడు సూర్యారావు. పాపం, తాము గుమికూడి చూడకపోతే ఆమె ఏమవుతుందో ? ఆమె హృదయానికి ఎంతగాయమో! తమ ప్రియురాలికి అని.

మర్నాడు సాయంత్రం ఏం జరిగేదో మరి ఆనాడే వెంటనే ఇంటికి రమ్మని సాంబం మామయ్యకి ఉత్తరం వచ్చింది. సూర్యారావుని చూసి పకపక నవ్వుతో రైలెక్కాడు సుబ్బారావు.

కాని సూర్యారావు మనసులో వంటోకూడా వుత్త కామన్‌సెన్సు విషం ఒదిలి వెళ్ళాడు మామయ్య. ఇంద్రజాలం పటాపంచలయింది. ఆ సాయంత్రం చివరిదాకా కూచోలేక పోయినాడు.

రాత్రి కాగానే మిత్రులతో బిజినెస్ మీటింగు పెట్టాడు. సాంబం మామయ్య మాటలు చాలా గుచ్చుకున్నాయి. ఈనాడే ఐతే.

"మామయ్యా, మమ్మల్ని తిట్టిన బూతులు నిజమే. కాని ట్రిగ్నామెట్రీ మాత్రం ఏం ఉపయోగం? మేము చేసే పనిలోనూ అర్థంలేదు, ట్రిగ్నామెట్రీలోనూ అర్థంలేదు. జీవితంమీద ప్రశ్నలు రేగినకొద్దీ, దేహ అవసరాలు తీర్చుకోడంలో తప్ప యింక దేంటోనూ అర్థం కనపడదు. కాని తాను చేసే పనిలో తప్ప, తక్కిన వాళ్ళు చేసే పనులలో అర్థం కనపడక పోవడం జ్ఞానవంతుల లక్షణం, ప్రస్తుతపు నాగరికతలో" అనే వాడే.

ఆనాడు మాత్రం హరికేన్ లాంతరు చీకట్లలో సభచేసి, తాము ప్రయోజనం కావాలనీ, వాళ్ళ నెలరోజుల సౌందర్యానుభవానికి ఒక అర్థం సాఫల్యం కల్పించి ధన్యులు అవాలనీ ? వాళ్ళ ప్రియురాలితో దగ్గిర సంబంధం ఏర్పరచుకోవాలనీ తీర్మానం చేసుకున్నారు ఏకగ్రీవంగా. జాషువా మాత్రం వోటు చెయ్యలేదు. సాధనం ఏమిటా అంటే, అనుశృతంగా, అనుమాయితీ ఐ, వాత్స్యాయనుడిచేత అభినందింపబడిన దూతికా అభిసారికత్వం అని ఒప్పుకున్నారు. ఈ నలుగురి నలుళ్ళహంసా వాళ్ళగౌరి: ఈ నలుగురు దిక్పాలకుల నలుడూ వాళ్ళ గౌరి.

వొచ్చిన గొడవ యీ ప్రపంచంలో ఒక్క మనిషికే చాలా పాత్రలు ఉండడం. ఒక్కడే ఉద్యోగస్తుడూ, భర్తా, తండ్రీ, భక్తుడూ ఐ ఉంటాడు. దానివల్లనే జీవితంలో యిన్ని చిక్కులు. విరుద్ధాలు, గౌరి దూతికే కాదు, నాయకి, ప్రియురాలు! దాసి, ఇన్నీను. మనం మనుషులకి పాత్రలు నిర్ణయిస్తే. కథలోనేగాని, జీవితంలో వాళ్ళు ఆ పాత్రలలో నిలవరు. భర్తలు భార్యలకి పతివ్రతా పాత్రలు నిర్ణయిస్తే వాళ్ళు వేశ్యల పాత్రలని ధరిస్తామంటారు. చెప్పో, చెప్పకండానో. మంత్రిత్వమిస్తే, నియంతల పాత్రలు ధరిస్తారు. ఇంకొందరు. నౌకరు సామ్యవాదినంటాడు. మరి యిది కథేకాదు, జీవితం కాబట్టే ఇంత గొడవ. చలం పాత్రలు చలం నియమించిన స్థానంలో నిలవరు. అందువల్లనే విమర్శకులు మనుషుల మనోభావాలు తెలీవు ఈ రచయితకి అంటారు. అప్రతిష్ట చలాన్నేగాని, అతని పాత్రలని అంటదు మరి.

నువ్వూ ఓ నాటకంలో ఓ పాత్రవై ప్రేక్షకుల్లో కూచుని చూడు అంటాడు భగవాన్.

సాంబం మామయ్యా సుబ్బారావూ రాకముందే, ఉమ్మడిగా కాకండా స్వకీయంగా చాలా అవస్త పట్టింది సూర్యారావుకి. మరి ఆ సంగతి చెప్పాలి మీకు. చెప్పకపోతే, వేదాంతం కిష్టయ్యగారు కోప్పడతారు. చలం చలానికే అవిశ్వాసి ఐనాడంటారు ఆ లోకంనించి, అతని రాతల్ని గమనిస్తో. మరి కాకినాడలో ఉన్నన్నాళ్ళూ చలం చాతల్ని అంత జాగ్రత్తగా గమనించినవారు, ఇప్పుడు అతని రాతలైనా గమనించనంత అప్రమత్తులైనారంటే నమ్మగలమా? కాని ఇప్పటికన్నా అర్థమై వుంటుందా, ఇతరుల రహస్యాల మీద దృష్టి నిలిపినవాళ్ళ కళ్ళు ఎంత అంధమై పోతాయో!

స్త్రీలో బిడ్డ కావాలనే కోర్కెని అంత బలవత్తరంగా పెట్టి, బిడ్డని కనడానికి, కనకపోవడానికీకూడా, అధికారాంధుడైన పురుషుడి అనుగ్రహం మీద ఆధారపడేట్టు చెయ్యడంలోనే, స్త్రీమీద పెద్ద దెబ్బతీసింది సృష్టి. ఎన్ని మీటింగులు చెయ్యనీ, ఎంత తిరగబడనీ, చలం ఎన్ని పుస్తకాలు రాయనీ, స్త్రీకి ఎన్నటికీ విముక్తిలేదు.

"స్త్రీ బాధల్ని ఇన్నింటిని పైన వేసుకున్నారు గాని, యీ బిడ్డలు లేకా, బిడ్డలువుండీ స్త్రీ పడే బాధల్ని మీరు ఎత్తుకోలేదేం?'' అన్నారు ఒకరు....నిజమే. ఆలోచించాడు చలం.

"ఆ విషయమై నిందవేసి తిట్టడానికి నాకెవరూ కనపడక గావును.'' అన్నాడు.

కాని నిందవుంది. లేకపోలేదు. కాని ఆ నింద దూరం, సూక్ష్మం. అతని గొడ్డలి వేటుకు ఆగదు. గొడ్డలి పెట్లు తప్ప అర్థంకావు.

"మనిషికోమాటా...''

అన్నారు పెద్దలు.

ఏమైతేనేం. సూర్యారావు ఇంటావిడికీ అతనిమీద చాలా కోపంగా వుంది. తన ఇంటో. ఒక్క గోడమాత్రం అడ్డంగా నివసిస్తూ, రాత్రి పదిగంటలసేపు నిర్విచారంగా నిద్రపోవడ మేమిటి ఈ మొగవాడు? తన అవస్త, తనగోల, జీవితంలో అన్ని సుఖాలూ

నాశనంచేసిన నిరంతరమైన ఆ శూన్యం అర్థంకాదా? హృదయమా పాషాణమా అని తక్కిన ఏనాటమీనికూడా నిందిస్తోంది. నడకల్లో, చూపుల్లో, సూర్యారావు, చాలా నేరస్తుడికింద తనని తాను నిందించుకుంటో, బాధని చూడలేని తన మెత్తదనాన్ని విమర్శించుకుంటో, మూల మూలల నక్కుతున్నాడు-ఇంటోకాదు, వీధుల్లో. గౌరికీ అతనిమీద ఫిర్యాదే! తనమీదనో, ఆ నలుగురిమీదనో, ప్రత్యేకం విశ్వనాధంమీదనో! కాదు. ప్రత్యేకం అతనిమీదనేనని తేలింది చివరికి.

"ఎన్నడూ దాసీపని చెయ్యనిదాన్ని, ఒక కిళ్ళీ కొట్టు ఇల్లాలిని, నేను పురాణ వనితలమల్లే ఈ దాస్యానికి ఎందుకు అంగీకరించాను? నా చీరెలు, నా శుభ్రం, నా జుట్టుముడి గమనించారా? నేను ఇల్లు వూడ్చే మనిషిమల్లే కనపడుతున్నానా? ఇది వుత్త అజ్ఞాతవాసం. స్త్రీ హృదయేచ్ఛా నియమానికి కట్టుబడి, మీకు చాకిరీకి పూనుకున్నాను. మీ మర్యాద లెవరికి కావాలి ? ఎవరికంటే వారికే మర్యాద. చాలా చవక మర్యాద. మర్యాద కడుపునింపకేగా, అసలు భర్త దగ్గిర్నించి బైట పడ్డది! ఈ దాస్యం ఉన్నత జీవితానికి సాధనమే కాకపోతే, నేనూ వప్పుకోను, పూర్వ పతివ్రతలూ వప్పుకో"రంటోంది.

ఆకలి తీర్చడానికి కథలు రాస్తారుగాని అభ్యుదయులు, యీ బాధ తీర్చే కథలు రాయరు. చలం శృంగారం రాస్తాడు ఎవరికి కావాలంటారు. చాలా న్యాయం అనడం. ఎందుకంటే వాళ్ళు పూనుకున్నంతవరకు యీ బాధ ఒక సమస్యేకాదు. రాయడమెందుకు, ఇంతమాత్రం దానికి? బియ్యమంటే పంచడానికి లేవుగాని, బియ్యంతిన్న శక్తి పంచడానికేగా! అంటారు. చాలా అర్థవుంది ఆ మాటల్లో.

న్యాయంగా సూర్యారావు సానుభూతి అంతా ఆ ఇంటి ఆవిడమీద వుండవలసింది. ఎందుకంటే ఆవిడ అవసరం! స్త్రీ అవసరం. తప్పించుకోలేని కఠినమైన అవసరం. గౌరిది బూర్జువా అవసరం. అది లగ్జరీ అవసరం కాని సూర్యారావు రక్తంలో అతను ఎరిస్టోక్రాట్ కావడంచేత, అతనికి లగ్జరీమీద ఎక్కువ సానుభూతి. అన్యాయమే, కాని ఎంత మనం ప్రిన్సిపిల్సు ప్రకారం వాదించినా, బోధించినా, మన సానుభూతినీ, ఇష్టాన్నీ ప్రవర్తననీ రక్తమే పరిపాలిస్తుంది. పైగా గౌరి అందమైనది. అందం సానుభూతికోసం వెతకనక్కర్లేదు. అందం పక్షాన పని చెయ్యడానికి మానవుల హృదయాల్లో కారణాలు సిద్ధంగా ఏర్పడి వుంటాయి. ఎన్ని భేదాలు తీసుకున్నా శారీరక మానసిక బలాలూ, అందాలూ అనే భేదం ఎన్నడూ తప్పదు ప్రపంచంలో. ప్రజలందరూ సమానులే - అందం, బలంవున్న వాళ్ళు తప్ప తక్కినవాళ్ళు. బలాన్నించైనా ప్రభుత్వాలు రక్షించగలవుగాని, అందంనించి మనుషుల్ని ఏ బాంబులూ రక్షించలేవు, విప్లవోద్రేకంలో మనుషులు ఎంత పశువులుగా మారినాసరే.

గౌరికీ సూర్యారావుకీ మధ్య చాలా అభ్యంతరాలున్నాయి. అతని మనసులో ఒక్క జాతికుక్కలకీ, ఇంకో జాతికుక్కలకీ వుండే అభ్యంతరాలు. హరిజనులతో భోజనం చెయ్యవచ్చు గాని, స్నానం చెయ్యడం కష్టం అంటాడు అందుకని. గౌరి కట్టూ, వళ్ళూ,

వాక్కూ చాలా శుభ్రం, నోరు తెరిచిందాకా. అతన్ని అద్భుతపడచేసిన అతని మిత్రురాళ్ళకన్న చాలా శుభ్రం. కాని ఎంత శుభ్రం చేసుకొన్నా కొందరు శుభ్రం కాలేరు. అట్లానే కొందరు, ఎంత అజాగ్రత్తగావున్నా మురికి కాలేరు. ఆ భేదం పుటకలోనే వుంటుంది - మనసులో, శరీరంలో కూడా. లోకంలో ఎన్నడూ పోనీ భేదాలలో ఇది ఒకటి.

కాని గౌరి సాహసం, దయగల పేషన్సు (patience) అతని మీద వాంఛకి సంబంధం లేని దయా, ఇవన్నీ అతని అభ్యంతరాల్ని మింగును-ఆ డాబామీద వెన్నెల ఉదయించకపోతే, నాటకాలమీద అతనికంత ఆసక్తి లేకపోతే. అంతకాలమూ అతన్ని ఏమనుకుందో గౌరి. తెలివి లేదనా, పుస్తకంలో స్త్రీలు అతని కళ్ళకీ అడ్డు తగులుతున్నారనా, ఇంకేమేం అనుకుందో - ఎందుకంటే, దయగలవాడు, రసికుడూ, తనని అన్ని విధాలా ఇష్టపడేవాడు, తను కనపడకపోతే వెతుక్కునేవాడు, యజమాని, తనని నిలువునా ఇష్టంగా చూసేమనిషి, ఇదేమిటి? అనుకోడం ఏమీ తప్పు కాదు. చివరికి మూర్ఖుడని - చూపులకందని జడత్వాన్ని సంభాషణతోనైనా మేల్కొలపాలని యత్నించింది.

గౌరి వాంఛని స్వీకరించపోవడానికి సూర్యారావులోని భీరుత్వం, క్రూరత్వం కావు కారణాలు. అతనిలోని దయ. అతను ఆలోచించకుండానే అతనికి తెలుసు గౌరిని స్వీకరించడమంటే, ఆమెని అంతా ఆమె నవ్వులతో కోర్కెలతో, ఆందంతో, ఇష్టంతోపాటు, ఆమె జాతి తక్కువతనాన్నీ, ఆమె పాత చరిత్ర పర్యవసానాల్నీ, గతం ఆమెలో వదిలిన న్యూనతానీడల్నీ, ఆమెలోని తేలికతనాన్నీ తాను తీసుకు తీరాలని. ఎందుకంటే అతని చాతకాదు స్త్రీలో ఓ మూల ఓ భాగాన్ని మాత్రం అనుభవించి దులిపేసుకోడం. ఇట్లానే మనలోని ఔన్నత్యాలు మన జీవిత పథంలో గొప్ప సంకెళ్ళయి బాధిస్తాయి. ఇతరులనీ బాధిస్తాయి. అందువల్లనే రసికులూ, ఆర్టిస్టులు, తాము ప్రపంచానికి అర్థంకారేమో అని ఏడుస్తారు.

ఇదే గొడవ స్త్రీతో పురుషుడికి. అతను కోరేది ఆమెలో అందం, స్త్రీత్వం, సౌజన్యం ఆమె, మాంసం, రక్తం, కోర్కులపుట్ట. అనాదిగా భూమిలోంచి చెత్త, దుమ్ము, రాళ్ళు, వీటన్నిటిలోంచీ తనమల్లేనే పరిణామం చెందిన ప్రాణి అని మరుస్తాడు. తన పైన ప్రసరించే కిరణాల్ని మాత్రం చేసి వెనుకనున్న వొత్తినీ, కంపుకొట్టే జిడ్డునూనెనీగమనించడు. మొదటి రొమాన్సు రోజుల్లో.

కళ్లూ, మూతి చాలునంటే స్త్రీ తన దేహభారాన్నంతా అతనిమీద మోపుతుంది. తన ఆశలతో, బరువులతో, కోర్కెలతో, చీరెల, నగల, రుచుల, మామూలు మట్టి ఆశలతో తనని పెనవేసుకుంటుంది. ఒక్కగంటసేపు ఆమె తనకి చాలునంటే జీవితమంతా నీదేనంటుంది అదే పురుషుడికి కోపం.

జాతి (కులంకాదు) లేని స్త్రీ, తనని అనుభవించిన స్త్రీ తనమీద తీసుకునే చనువుని పురుషుడు సహించలేడు.

పైగా ఇప్పుడు సభవారు గౌరిని దూతికగా ఉద్యోగించమని భారం అతనిమీద వేశారు. గౌరి రహస్యాన్ని సభలో పెట్టడం అతని కిష్టంలేదు. విశ్వనాథంతో విడిగా చెప్పుకున్నాడు. కాని విశ్వనాథం ఎందుకు కనికరిస్తాడు అతని పైని?

"త్యాగంలేంది దూతికలు యెట్లా లభిస్తారు?" అన్నాడు. అన్నాడేగాని, త్యాగమనే సంగతి ముందు అసలు అతను అంగీకరించనేలేదు.

"ఏమి వగలయ్యా? శుభ్రమైన గౌరి మీకు యెక్కసమయిందా ? అంతకన్న అప్సరసలు తన వాకిట కాచుకున్నట్లు. చాలా కష్టమైన సమస్యే వొచ్చింది. పాపం!" అన్నాడు. అని, పైగా.

ఏమిటి యిది? మేము "గ్రాంటెడ్"గా వొప్పుకున్న విషయంలో మమ్మల్ని డిజప్పాయింటు చెయ్యడమేగాక, మిత్రులమైన మాకు తల వొంపులు తీసుకొస్తున్నావు? తన ప్రియురాలి ఆకర్షణని యింత చవకగా చూస్తున్నానని ఆ కిళ్ళీ కొట్టు అతనికి తెలిస్తే చాలా ఘోరాలు జరుగుతాయి జాగ్రత్త" అన్నాడు పైగా.

"అతనికి ఆమెమీద చాలా ప్రేమ, ఆమె హృదయానికి ఏ మాత్రం గాయమైనా, సహించడు. అతనేమిటి నేనే సహించను" అన్నాడు ఇంకా.

"పోనీ నువ్వు తీర్చరాదా?" అన్నాడు సూర్యారావు.

"ఇదివరకే చూశాను. కాని అక్కర్లేదంది" అన్నాడు.

"కారణం?"

"ఇంకా అట్లా కూచుని అడుగుతారేం?" అన్నాడు.

"అన్నదా?" అన్నాడు భయం, సూర్యారావు.

"అన్నట్టే అంటుందా ఏమిటి? చతురుడిననుకున్నాను. తనను అర్థించే పురుషుడితో యెన్నడన్నా ఆ మాట అంటుందా బుద్ధి వున్న స్త్రీ ?"

"మరి యెట్లా తెలిసింది?"

"ఇంక మీతో మాట్లాడి ప్రయోజనంలేదు." అని లేచిపోయినాడు. గొప్ప మిత్రుడు విశ్వనాథం. కనక గౌరి దూత్యాన్ని నిర్వహించే యత్నం సూర్యారావుకి చాలా కష్ట భూయిష్టమయింది. రెండురోజులు ఆలోచించాడు ఇంక తప్పదని తన మిత్రుల్ని ఆనాడు టీకి రావొద్దన్నాడు.

"ఏరీ వాళ్ళు ?" అంది స్టౌ వెలిగిస్తో గౌరి.

స్టౌ వెలిగించడం నేర్చుకోమన్నారు గౌరిని, పూర్వం ఓనాడు. "నా కెందుకండీ?" అంది.

"కాదు. స్టౌ వెలిగించడం నేర్చుకునివుంటే యెందుకన్నా మంచిది" అన్నారు. సాంబం మామయ్య. ట్రిగ్నామెట్రీ జ్ఞాపకం వొచ్చింది.

"దానికేంలెండి? ఆ పనికూడా నామీద పారెయ్యడానికి" అన్నది.

తల వొంచుకున్నాడు. ఈ విద్య అంతా ఏమిటి ? జ్ఞానంమీద ఈ గౌరవం బోధించడం యెందుకు? వయోజన విద్య, బలవంతపు సర్వసాధారణ విద్యాదానం - వీటి అర్థం ఏమిటి? ముందు నేర్చుకోమని, జ్ఞానం జ్ఞానంకోసమని మోసగించి బాధ్యతల్ని పడెయ్యడానికేగా తన్ని చదివించేదీ, తరవాత "చదువుకున్నవాడివి యింతేరా నువ్వు!" అని దొంగ ఆశ్చర్యపడేదీ. చదువుకున్నవాడివి, మేము నాగరికత పేరుతో కల్పించిన యీ అర్థంలేని నడుం విరిగే చాకిరీ, డబ్బుపేర, సంసారంపేర, నాగరికతపేర, మర్యాదపేర, మానవోద్ధరణపేర, పరోపకారం పేర, యీ గాడిద చాకిరీ, చాలా గొప్పగా, డంబంగాచేసి, నడుం విరుచుకుని, నాగరిక ప్రపంచంలో ఒక పురుగువై పోరా అనేకద!

స్టౌ వెలిగిస్తోన్న గౌరితో మళ్ళీ ఈనాడు.

"నేనే రావొద్దన్నాను. నీతో మాట్లాడాలని" అన్నాడు.

స్పిరిట్ స్టౌనిండా ఒలకపోసింది.

"గౌరీ, స్పిరిట్ పోనీగానీ, నీతో ఓ అవసరం వచ్చింది"

"ఈనాడా?"

"అవును....నువ్వే రాయబారం నడిపిపెట్టాలి"

"ఎదురింటి ఆమెతోనేనా?"

"యెట్లా తెలిసింది నీకు?"

అమ్మా! అతని పని సులభమయింది. ఆ స్వంత సంతోషంలో, గౌరి ఏమౌతోందనేది అతనికి పట్టలేదు.

పట్టించుకుంటే పెనుభూతం కాని సంగతి లేదు ప్రపంచంలో, ముఖ్యం స్త్రీ హృదయం.

యెంత పట్టించుకోకపోయినా, కాలం లెక్క చెయ్యకుండా. మౌనంగా బతకగలది ఆ స్త్రీ హృదయం ఒక్కటే.

అందుకనే అంతచౌక బజారులో.

అందుకనే అంత విలువ స్వర్గంలో.

అదే అసలైన నరకం. తన అనుమానాలకి ఇతరుల ఔదార్యం, తన క్రూరత్వానికి యితరుల జాలి, తన సంకుచితత్వానికి యితరుల విశాలత్వం - ఇవే నిజమైన నరకం. తెలిసీ, తెలియకా, తెలుసుకోకా? యెప్పుడూ ఈ నరకంలో బతుకుతున్నాడు మానవుడు.

ఈ లోపలి నరకంతో పోలిస్తే బైట కష్టాలు ఒక భారం కాదు మనిషికి. తాను నిర్లక్ష్యం చేసిన పిల్ల చిరునవ్వు, తాను తన్నిన పిల్లవాడి ప్రేమ, తాను ఒదిలినకుక్క విశ్వాసం. తాను తిట్టిన యీశ్వరుడి ఓర్పు-ఇవే మానవుల సహజమైన ఆనందాన్ని విషంచేసి, ముఖాల్ని యింత విషాదంగాచేసేవి. ఇట్లాంటి నిరంతరమైన అపజయాలవల్లనే, స్త్రీమీద అంత కసి పురుషుడికి.

"గౌరీ, యెంత గొప్పదానివి?" అని కావిలించుకున్నాడు.

ఆమె నెమ్మదిగా వొదిలించుకుంది.

సూర్యారావు నిన్ను గౌరవిస్తున్నాననే అనుకున్నాడు - కాని నీకు తెలుసు. అతను నిన్నవమానిస్తున్నాడని, ఆ కావిలింతతో. అతని జ్ఞానం రసికత్వం, దృష్టి, వీటిమీద అతనికెంత గర్వం.

అతను నిన్ను "గొప్పదానివి" అనడం నీకో లెఖ్ఖా, గౌరీ? నిజమైన గొప్పతనంలేక, గొప్ప పనులు చేసే, మాట్లాడే, నటించే వాళ్ళకీ తమలోలేనివే గొప్పతనం తమలో వుందనుకునే వాళ్ళకీ, యెవరన్నా వాళ్ళని గొప్పవాళ్ళనడం గొప్ప. నీకేం గొప్ప! గొప్ప అనే మాటకి అర్థం తెలీని గొప్పని నీ కెన్నడూ నువ్వు ఆరోపించుకోని నీకేం గొప్ప ?

అయినా సూర్యారావునించి గొప్పా కావలసింది ?

"సరేలెండి" అంది.

ఆ "సరే లెండి" అన్నమాటతో మెళుకువయింది, అతని నీచభావం.

పురుష హృదయం, ఇంత కార్యసాధనలో, కీర్తిలో, ఎగపాకడాలలో, గర్వాలలో, ధనార్జనలో, ప్రమత్తతపొంది, దట్టమైన పొరలు కప్పుకోకపోతే, రోజుకెన్నిసార్లు సిగ్గుతో తల వంచవలసినగతి పడుతుందో స్త్రీ పాదాలముందు. స్త్రీ చూపుని భరించలేక, ఉద్యోగాలలో, చీట్లపేకల్లో, క్లబ్బుల్లో, వార్తాపత్రికల వెనక, ధీరంగా దాక్కుంటాడు పురుషుడు.

ఆ సాయంత్రం డాబారంగంమీద వాళ్ళ సత్యభామకి వాళ్ళ గౌరి కృష్ణుడయింది. అనేకమంది కృష్ణులకన్న బాగా నటించింది.

మర్నాడు పొద్దున్న గౌరి చుట్టూ మూగారు కబుర్లకోసం, కాని గౌరి ఏమీ చెప్పలేదు. "ఏముంది చెప్పడానికి" అంటుంది, ఈ నలుగురు దిక్పాలకులతో ఆ నలుడు.

"మా సంగతి ఏమన్నా మాట్లాడావా?"

"ఈనాడా?"

"మొదటినుంచీ నీకు తెలుసా గౌరీ!"

"కాక....నే నేం గుడ్డిదాన్నా!"

"పోనీలే, ఆమె ఏమంది?"

"కొత్తగా ఏముంది ఆమెకి అనడానికి?"

"కొత్తగా అంటే? ఇదివరకే మాట్లాడిందా మా సంగతి ? మా సంగతి నీతో యెందుకు మాట్లాడుతుంది?"

"నాతో రోహిణి మాట్లాడని సంగతి ఏదీలేదు."

"అమ్మ దొంగా! చెప్పు, మొదటినుంచీ ఏమందో?"

"ఏం లేదు. నవ్వుతోంది."

"ఎందుకు?"

"మిమ్మల్ని చూసి."

"ఎందుకు మమ్మల్ని చూసి నవ్వడం."

"ఒకర్ని చూసి నవ్వకపోవచ్చు. నలుగుర్ని చూసి నవ్వరా!"

గ్రీక్ దేవతలపై పడ్డ ఆపిల్‌పండు కూడా అంత తీవ్రమైన తగాదాలకు కారణం కాలేదు, ఆనాడు గౌరి వాళ్ళమధ్య పడవేసిన యీ జవాబు కన్న. అవును నలుగురూ! ఏమిటి? నవ్వకేం చేస్తుంది? అనిపించింది ప్రతివారికీ.

"సరేలే. మాలో ఏరుకోమను, తన కిష్టమైనవారిని" అన్నాడు ఉదారంగా, సూర్యారావు.

"ఎందుకు ఏరుకోడం?"

"మరి ఎట్లా? నవ్వుతోందంటివి ? ఆమె మమ్మల్ని కలుసుకోదామరి?"

"ఎందుకు కలుసుకుంటుంది?"

"మరి నిన్ను దీంటోకి పిలిచింది ఎందుకు మరి ? నువ్వు మాకు సహాయమేమిటి? ఆ సంగతి అడగలేదా నువ్వు ?"

"అడుగుతాలెండి! ఎవర్ని కలుసుకోడం? నలుగురినీనా?"

విరగబడి నవ్వింది.

"ఆ సంగతి చూద్దాంలే. అసలు కలుసుకుంటుదా?"

"ఎట్లా కలుసుకుంటుంది?"

"ఏమి?"

"మీరే కలుసుకోరాదూ?"

"ఎట్లా?"

"మగవారు మీకే ఎట్లా అయితే, ఆడది ఆమెకి ఎట్లా?"

"రమ్మను ఓ రాత్రి" అన్నాడు విశ్వనాథం ధైర్యంచేసి.

"చాలా కష్టం. చూస్తారు. చూస్తే యింకేమన్నావుందా?"

"మరి యింకెందుకు రాయబారం?"

"ఎందుకో నాకేం తెలుసూ?"

"పోనీలే. ఇది చెప్పు. ఆమెకి మమ్మల్ని కలుసుకోడం యిష్టమేనా ?"

"ఎవర్ని కలుసుకోడం యిష్టమేనా?"

మళ్ళీ మొదటికి వచ్చారు. ఆ ప్రశ్నకి వాళ్ళలో యెవరిలోనూ సమాధానం లేదు. ఏదో మామూలు అలవాట్లవల్లా, సాంబం మామయ్య పోసిపోయిన కామన్‌సెన్సు విషంవల్లనేగాని, వాళ్ళెవరికీ గట్టిగా, తప్పకండా రాత్రి ఆమెని పైకి తెచ్చింది వాళ్ళ మనసుల్లో. కాని దేశాల పూర్వపురాణాలలోకన్న యీనాటి మనుషులు చాలా బుద్ధిగల వాళ్ళు. అదే నిదర్శనం మానవజాతి నైతికంగా అభివృద్ధి చెందుతోందనడానికి. హిందూపురాణ కథలు వింటే, ఆ మహత్యాలూ, మహిమలూ మానవులకి లేకపోవచ్చును కాని, ఇంద్రుడికన్న అతని చుట్టూవుండే మునులకన్న, శ్రీ మహావిష్ణువుకన్న, చాలా తక్కువ మానవుడు కూడా యీనాడు ఉన్నతంగా ప్రవర్తిస్తాడు. వాళ్ళ యీర్ష్యలూ, వ్యభిచారాలూ, పంతాలూ, కొట్లాటలూ చాలా దూరం యీనాటి నాగరిక ప్రపంచంనించి.

వీళ్ళు యీనాటి నాగరిక యువకులు గనక అప్రయత్నంగా వీళ్ళ సంఘభావాన్ని నిలుపుకున్నారు.

మర్నాటినించి గౌరిచేత పూలు పంపారు. ప్రతి సాయింత్రం చీకటి పడ్డ తరవాత, వెళ్ళేప్పుడు ఆ పూలు తలలోంచి తీసి వాళ్ళ దొడ్లోకి విసిరి వేసి వెళ్ళిపోయేది రోహిణి. మూడో రోజునించి ఆమెకి ఉత్తరాలు ప్రారంభించారు.

నలుగురూ విడివిడిగా ఉత్తరాలు రాద్దామన్నాడు సూర్యారావు. వాళ్ళు ముగ్గురూ చాతకాదన్నారు. జాషువా తనసలు పరస్త్రీల నెరగనన్నాడు. వెంటకసుబ్బయ్య ఉత్తరాలు చదువుకోగల స్త్రీలు తనకు తటస్థపడలేదన్నాడు. విశ్వనాథం తన ప్రేమలేఖలన్నీ 'రాత్రికి నన్ను యీ చోట యింతవేళకు కలుసుకో" అన్న ఒక వాక్యమే నన్నాడు.

కవి కనక సూర్యారావుమీదనే పడ్డది ఆ భారం.

ప్రతిరోజూ కట్టలు కట్టలు ఉత్తరాలు రాసి పంపేవారు సూర్యారావు అందరి పేరా. కవిత్వం, విరహం, స్తోత్రాలూ, స్వస్తుతులు, ఔదార్యం, స్త్రీలయెడల, ముఖ్యం ఆమె యెడల భక్తీ, ఇవన్నీ ప్రకటిస్తో. బళ్ళో పాఠాలు చెప్పడం మాని ఉత్తరాలల్లుతున్నాడు. పూర్తికాగానే, అప్పుడప్పుడు మధ్య సగంలోనే, ఉత్తరం అతను చదివి వినిపిస్తోవుంటే క్లాసులకి వెళ్ళడం మరిచేవారు మిత్రులు. తనమీద కుట్ర చేస్తున్నారని భయపడుతున్నాడు హెడ్మాస్టరు,

వాళ్ళు మూలలచేరడం చూసి, గవర్నమెంటు నౌకర్లు సులభంగా దేశద్రోహులయ్యే ఆ రోజుల్లో.

జవాబులు ఆమె దగ్గిర్నించి రానూలేదు. రాలేదనిచింతాలేదు. కొన్ని రోజుల తరవాత జవాబులు వస్తాయని యెదురు చూడనూలేదు. వాళ్ళ ఉత్తరాలు చూసి యేమంది అని అడిగే వాళ్ళు దూతికని.

"ఏడుస్తుంది."

"ఏడవడమెందుకు?"

"అయ్యో! ఏడుస్తుందా?"

"మా మూలంగా ఏడుస్తోందా?"

"వొద్దను. పాపం, యాడవవొద్దను."

"ఉత్తరాన్ని రొమ్ముకద్దుకుని ఒకటే యేడుస్తుంది."

"ఎందుకు?"

"ఏమంటుంది?"

"ఏం రాశాడో యితను అట్లా యేడిపించేందుకు ?"

"ఏం చదివి ఏడుస్తుంది?"

"అయ్యో! యెంత ప్రేమ! నేనెంత కావాలి! ఏం చెయ్యను? ఎట్లా నా ప్రేమని తెలియచెయ్యను?" అని యేడుస్తుంది."

"ఏం? ఏడవకపోతే....రారాదూ?" అనబోయి నోరు మూసుకున్నారు. ఎవరి దగ్గిరికీ? అని గౌరి మొదటికి వొస్తుందని.

ఆనాటినించి ఉత్తరాలు-ఆమె రావాలనీ, తప్పకుండా రావాలనీ, రాకపోతే తాము బతకమనీ గట్టిగా రాస్తున్నాడు. ప్రతిరోజూ గౌరి అదే చెపుతుంది యేడుస్తోందని.

"పోనీలే. అంత యేడిపిస్తున్నాంగావును, రాయంలే" అన్నాడు తలనొప్పి వొచ్చి ఓ రోజు రాయలేక, సూర్యారావు.

సాయింత్రానికి గౌరి.

"ఉత్తరం రాయలేదని మీకు కోపం వచ్చిందని ఒకటే యేడుస్తోంది" అంది.

ఆ సాయింత్రం యెర్రటి కళ్ళతో ప్రత్యక్షమయింది రోహిణి. వాళ్ళకి కోపం లేదని సౌంజ్ఞలు చేశారు. నవ్వించారు. దొడ్లొంచే కావిలించుకుని, కన్నీళ్ళు తుడిచి లాలించారు. వాళ్ళ ప్రియురాల్ని.

మర్నాడు మధ్యాహ్నం గౌరి,

"ఉత్తరం వచ్చింది. రోహిణి భర్తగారు నాలుగురోజుల్లో వస్తున్నారట, ఏడుస్తోంది" అంది.

"ఎందుకు యేడవడం?"

"మొగుడంటే యిష్టంలేదా?"

"ఎట్లా వస్తున్నాడు యిప్పుడు?"

"వస్తే?"

"శలవలుట" అంది గౌరి.

"ఇప్పుడేం శలవలు?"

"దసరా యింకా చాలా రోజులుంది."

"అంతా వుత్తది, మమ్మల్ని దడిపించడానికి."

"రానీలే. వస్తేనేం!"

"అవేవో దసరాముందే ఇస్తారుట శలవలు వాళ్ళకి" అంది

"మరి డాబామీదికి రాదా?"

"ఉత్తరాలు రాయడానికి వీల్లేదా?"

"ఎన్నాళ్ళుంటాడు!"

"వాళ్ళ వూరు పోడా?"

"పాపం, ఆ ముసలి తలిదండ్రుల్ని చూడడా!"

"బావుంటాడా?"

"ఎప్పుడూ అతని దగ్గిరే కూచుంటుందా?"

"పోనీ, ఆయన్ని టీకి పిలుస్తాం. వస్తాడా?"

మొత్తానికి చాలా నిరుత్సాహంలో పడ్డారు. సాయంత్రం వాళ్ళ ప్రియురాలి మొహంలోనూ చాలా నిరుత్సాహం. ఏం బాగాలేదు ఆ సాయంత్రం.

* * *

ఆ నాడు భాద్రపద పౌర్ణమి, సూర్యారావు తలుపు తెరుచుకుని వెన్నెల చూస్తో పడుకున్నాడు, దిగులుగా, రోహిణి మీది విరహంవల్ల. ఎప్పటికీరాదు ఆమె. ఆమెని కావిలించుకునే భాగ్యం ఎప్పుడూకలగదు.

బైట ఎవరో పాడుతున్నారు, సన్నగా, నాజూకుగా.

"నీముద్దు మొగమూ, కురులు చూసీ, కోరినానురా" అని.

ఆమె ఇప్పుడు ఇక్కడ తన పక్కమీద వుండకూడదా!వాళ్ళవాళ్లు ఎవరింటికన్నా భోజనానికి వెళ్ళకూడదా? కాని ఈమెని ఎందుకు వొదులుతారు ఇంటో? ఆడవాళ్ళకి కలిగే అభ్యంతరాలు రాకూడదా ? అట్లా అయితే, ఆమె ఎందుకు వస్తుంది? బ్రాహ్మల ఆచారం. అందులో వైష్ణవులులాగున్నారు. పోనీ, దూరంగా కూచోడానికైనా రాకూడదా ? ఎట్లా వస్తుంది? తన ఇంటిని ఒదలాలి. రోడ్డుమీద పెద్దవెన్నెల. ఆడుకుంటున్న పిల్లలు. తన దొడ్డితలుపు లోపల గొళ్లెం. గొళ్ళెంవేసివున్నదో లేదో అనే మిషతో తిరిగే ఇంటి ఆమె? ఎట్లా వస్తుంది. రాదు.

"సరసాకు రమ్మని పిలిచితె పలుకవేమిరా!" అంటున్నాడు స్త్రీ కంఠంలాగుంది అతనిది.

ఆ పలకని క్షుద్రుడెవడబ్బా!

పూర్వపు పాటలన్నీ ఇంతే. జావళీలు క్షేత్రయ్యపదాలు. స్త్రీలు పురుషులకోసం ఒకటే విరహాలు. ఈనాడు ఏ స్త్రీ ఏ పురుషుడికోసమూ విరహపడ్డట్టు కనిపించదు. ముద్దుమొగమూ, కురులూ చూసి మోహించింది. ఈనాడు ఉద్యోగమూ, కారూ చూసి మోహిస్తారు స్త్రీలు. ముద్దుమొహంచూసి మోహించామనడం చాలా నీచం. అసలు మోహించామని కూడా ఒప్పుకోరు. మోహిస్తే, చాలా సిగ్గుపడి, ఏదో మాగతి అని విచారపడతారు.

పన్నీరు బుడ్లూ, గంధం తయారుగా పెట్టుకుని ఎప్పుడు ప్రియుడు వస్తాడా అని స్త్రీ ఎదురుచూసేకాలం ఉండేది. ఈనాడు పుస్తకాలు చదువుతో వుంటారు, వెన్నెల రాత్రులు.

"రాడాయెనే"

"ఏ మాయలాడి బోధనలాచే"

"ఇంతిరో వాని మనసెంత చిన్నపోయెనో"

"ఎప్పుడు వత్తువోయని తలవాకిలి ఇల్లుగ"

ఇట్లా అయ్యే స్త్రీలకాలం - ఎంత అదృష్టమో ఆకాలంలో ఆకర్షకమైన యువకుడై పుట్టడం-స్త్రీలకీ, పురుషులకీ శృంగారపు విలువలు పోయినాయి-ఒక్క నండూరి సుబ్బారావుగారిలో తప్ప, అనుకుంటో కలలు కంటున్నాడు ఆ మధురమైన రాత్రి. ఇట్లాంటి వెన్నెలరాత్రులే స్త్రీలు విరహపడేవారు. చంద్రుడిలో మచ్చలు విరహిణుల చూపులుకాల్చిన మచ్చలన్నాడు మహాకవి. ఈనాడు సినీమాపాటలలోనేగాని, వసంతంగాని, కోవెలలుగాని, మలయమారుతంగాని, వెన్నెలగాని ఏ హృదయాన్నీ చలింపచెయ్యవు. అదుగో వెన్నెట్లో అట్లా తూములమీద కూచుని కబుర్లాడతారు యువకులు. కొందరు పుస్తకాలు వల్లిస్తారు.

స్త్రీలూ గుమ్మాలలో కూచుని కూరల్నీ, పిల్లల్నీ వర్ణించుకుంటారు. ఛీ, ఏం కాలం! శృంగారం మరుపురావడం వల్లనే ఇన్ని ద్వేషాలూ, యుద్ధాలూ ప్రపంచంలో.

ఆమె తనకు దక్కితేనా? ఇట్లా వుత్తకబుర్లు కాదు. ఆమెని గట్టిగా కదిలించాలి. తనతో ఒచ్చెయ్యమనాలి. లేవతీసుకుపోవాలి.

"నన్నిడిసి పెట్టెల్లినాడే, నావాడు"

అని శ్రీరామమూర్తి రికార్డు వరసలో పాడుతున్నారు. నవ్వుతున్నారు. చప్పున గుమ్మంలోకి వెళ్ళిచూశాడు. డాబాపైన నుంచుని పాడుతోంది రోహిణి. అతన్ని చూడ్డంతోనే సిగ్గుగా, నవ్వుతో కొంచెం వెనక్కి వెళ్ళింది. మెట్లమీద కూలబడ్డాడు అతను.

ఆమె చాలా ఉల్లిపొర చీరె కట్టుకుంది. తూర్పునించి ఆమెమీద ఎదురుగా పడుతున్నాడు చంద్రుడు. చీరె అంచు మెరుస్తోంది ఆమె పమిట మీద. రొమ్ముమీద మెరుస్తోంది ఏదో హారం. జాకెట్టులేదు. రెవికలేదు, ఆసంగతి చాలా స్పష్టంగా కనపడుతోంది. ఆ వెన్నెల తెల్ల వెలుగులో. ఆమె కదలడం, తిరగడంలో, చప్పుడులేకండా నవ్వడంలో, ఆ పైట ఎప్పుడు తొలిగిపోతుందో అని భయమేసింది అతనికి. ఏమిటీ దివ్యదర్శనం! తనకోసం, ప్రత్యేకం తనకోసం! ఏంచెయ్యాలి? ఎట్లా చెప్పాలి తన కృతజ్ఞతని, తన ఆనందాన్ని, తన తపనని. ఏం చెప్పి లాభంలేదు. చెప్పడానికీ, తెలిచెయ్యడానికీ, కదలడానికీ శక్తిలేదు. ఆ మెట్లమీద నీరైనాడు. స్తబ్దుడైనాడు, ఇట్లాంటి అదృష్టం. ఆదృశ్యం ఏనాడైనా, ఏ యుగంలోనైనా, ఏ కవి వూహలో నైనా తటస్థించివుంటుందా? ఎంత గొప్ప జాతకం తనది! ఇంక ఈ దృశ్యం తరవాత, యీ గొప్ప అనురాగం తరవాత, ఇంతకన్న ఆ స్త్రీకన్న తనకేం కావాలి? ఇంక ఏ స్త్రీమీద నిలుస్తాయి తనకళ్లు! తనకింక తృప్తీ, శాంతీ ఎక్కడ, ఈమెలో కాక!

ఆమె పిలుస్తోంది. చేతులు జాస్తోంది? ఆ చూపులో ఆశ. కోర్కె పిలుపు, అతన్ని చూసిన తృప్తి, సంతోషం! ఎట్లా ఓర్చుకోడం? బంగారుగాజులు తళతళ మంటున్నాయి వెలుగులో. చేతులు కొంచెంగా యెత్తి పిలుస్తోంది. రమ్మంటోంది. దూకలేదా? యెదిరించి తలుపుకొట్టి తీసుకుని పైకివెళ్ళి ఈమె నాది! అనలేడా? పూర్వపు యోధులు చేశారు. ఈనాటి నీరసపు యువకులు-విద్య -నాగరికత-మర్యాద! ఈనాడైనా నాగరికతలేని జాతుల్లో తన్నుకుంటారు. పొడుచుకుంటారు. ఎత్తుకుపోతారు. కాని యీ పోలీసుల ప్రభుత్వంలో... యువకులింత చచ్చు పీనుగులైనారు గనుకనే ఏ స్త్రీ వీళ్ళకోసం విరహపడదు. తలవాకిళ్ళలో కాచుకుని వుండదు. కాలం, కాదు-చదువు, నాగరికత. మర్నాడు హెడ్మాస్టరు "ఏమిటి నీమీద వూళ్ళో యీ గొడవ!" అంటే "అవును, నా కా స్త్రీ. ఇంకోరిభార్య అయితేనేం, కావాలి. నా మీద ఆమెకి ప్రేమ. నాకేం లెక్క" అనగలడా తాను?

"ఈమె నాది" అని తాను రోడ్డుమీద నిలబలడగలడా ? కాని ఆ పిలుపు! ఆ పిలుపు! ఎట్లా నిలపడం? తానూ ఒక మొగాడేనా?

చూడు, చూడు. ఆ కళ్ళలో ఆ నింద! "ఇంతేనా నువ్వు! రాలేవా? రావా? నేను అందంగాలేనా?" అంటున్నాయి కళ్ళు.

"ఈ రేయి నన్నొల్లనేరవా. రాజా"

అంటున్నాయి ఆ పెదిమలు.

"ఎన్నెలల సొగసంత ఏటిపాలేనటర!"

ఛీ, ఛీ పాడుబతుకు.

ఏం అందం? ఆ పిలుపుని, ఆ దృశ్యాన్ని-చలమన్నా ఇట్లాంటి దర్శనాన్ని వర్ణించ గలిగాడా?

దీనంగా అతనివంక పిట్టగోడమీదనించి ఒంటి చూసింది, రావా, రావా! అని అడిగింది తల వూయిస్తో.

తను అశక్తుడు. ఏమీ చెయ్యలేడు ఇంకా ఆనాటికి రాలేదు. గాని-

"సోజా, రాజకుమారీ...." అని పాడివుండును అతను.

"పై కిరా, అట్లా రోడ్డుమీదనించి తలుపు తెరుచుకుని. మెట్లెక్కి యిట్లారా" అంటోంది సౌంజ్ఞలతో, అలా అందమైన జావళీకి అభినయనం పడుతున్నట్టు. తలుపు తీసివుందేమో! వెడితే! కాని ఆ తలుపు సరిగా వరండామీదికి తెరుచుకుంటుంది! ప్లీడరు ముక్కు కిందికి.

కాని పూర్వం వెళ్లేవాళ్ళు పురుషులు. ఈ పోలీసురాజ్యం, యీ చచ్చు చదువులూ రాకముందు వెళ్ళేవాళ్లు. వెళ్ళి ఆమెని యెత్తుకుపొయ్యేవాళ్ళు. ఆ భర్తవేపువాళ్ళు తంతేనేం? చంపితేనేం? ఆమెని ఆ అరగంటా యెత్తుకున్నది, ఆమెని తాకుతున్నది, ఆమెని తనదీ అనుకున్నది చాలదా? ఈ కాలంలో "పాపం! ఆ స్త్రీ సంసారం పాడుచేస్తామా" అనే నీతులకింద దాక్కుంటారు. అవును, పరుల కంటబడకుండా, తమకి అపకీర్తీ, ఆపదా రాకండా యెన్ని సంసారాలన్నా ధ్వంసంచేస్తారు. ఎందరు స్త్రీలనన్నా వంచిస్తారు. కాని బహిరంగంగా క్లెయిమ్ చెయ్యలేరు.

స్త్రీకైననూ, ఈమె నాకు కావాలని పురుషుడు తెగించడం, ఆపదలోకి వెళ్ళడం యెంత ఘనత, యెంతకీర్తి, తనమీద తనకి యెంతగౌరవం. తనకి ఇష్టంలేని పురుషుడైనాసరే! తనకోసం పురుషులు తన్నుకోడమంత తృప్తి స్త్రీకి ఇంక జీవితంలో లేనేలేదు. ఆనాదిగా మృగాలలోంచి ఒస్తోంది ఆ ఆశ ఆమె రక్తంలో. ఈనాడు అది యీ సంసార మర్యాదలతో తటస్థపడకనే ఇంత నిర్జీవమైపోయింది. ఆమె ఎంత తయారై, యెంత ఆశతో చూసినాసరే, తనని గట్టిగా, ధైర్యంగా కోరగల పురుషులు లేరని తెలుసు ఆమెకి.

"వస్తే. ఇట్లా కావిలించుకుంటాను. నా మొహాన్ని ఇట్లా నీ రొమ్ముకి అద్దుకుంటాను. ఎట్లా నిద్రపోనూ నువ్వులేంది. ఈ రాత్రి!" అంటోంది. కళ్ళలో యెంత విరహం, జాలి!

ఇదంతా నిజమా! లేక కలా! ఆమె యెవరన్నా దేవకన్యా!

ఎవరైతేనేం! ఆ పిలుపుకి అట్లా, కదలక, మొద్దుమల్లే కూచునే తానో మొగవాడా? ఈ రాత్రి తన భీరుత్వానికి తన జన్మ అంతా కాలిచావడా తాను! తన మరాద్యతో, ఉద్యోగంతో ఎంత ఐశ్వర్యం, కుటుంబం, ఆస్తి, ఘనత సంపాయించినా, తనకేమిస్తాయి?"

చప్పునలేచి, వస్తున్నానని సౌజ్ఞచేశాడు. ఆమె పకపకా నవ్వింది. పళ్ళవరసమీద వెన్నెల తళతళమంది. ఇంతసేపు ఆమె చెంపలమీద పడే జుట్టుతో దోబూచులాడే వెన్నెల, ఆమె మెడకింది రొమ్ము మధ్యనున్న చీకట్లతో తగూ పెట్టుకున్న వెన్నెల. ఆమె దేహాన్ని తాకి మూర్ఛలు పోతున్న మృదువైన వెన్నెల.

ముక్కుమీద వేలేసుకుని కింద వున్నారని చూసింది. కాని అతను వినతలుచుకోలేదు. అతను చూస్తుండగా నవ్వుతో అతనికోముద్దు విసిరి కిందికి వెళ్ళిపోయింది. తాను యెట్లానూ రాలేడని తెలుసు ఆమెకి.

లోపలికి వచ్చి మెట్లమీద కూచుని ఆలోచిస్తున్నాడు. నిశ్చయానికి వచ్చాడు. తక్కిన తన మిత్రులు సంసారులు. తనకి పెళ్ళిలేదు. వాళ్ళేం చేసుకుంటారు యీమెని? తనతో కలిసి ఆడుతున్నారన్న మాటే కాని యీమె యెంత కావాలి వాళ్ళకి! తాను ఒక్కడే యీమెని తీసుకుంటే మిత్రద్రోహమెట్లా అవుతుంది?

కాని ఆమెకి ఎవరిమీదో? కాని ఈ రాత్రి తరవాత తనకి చాలా నిశ్చయం ఆమె తనదేవత. తను ప్రత్యేకం ప్రయత్నం చెయ్యాలి.

చేసి?

తీసుకుపోవాలి. తన వుద్యోగం? వుండదు. ఏమో, వుంటుందేమో ముందు తీసుకు పోవడానికి డబ్బు! ఇల్లాంటి చచ్చు ఆలోచనల్ని రానిస్తే తానేమీ చెయ్యలేడు. తీసుకుపోవాలని గట్టిగా నిశ్చయించుకున్నాడు.

కుర్రవాడు. చదువులోకూడా యింకా యవ్వనం చావనివాడు. సూనృతమైన హృదయం కలవాడు. కనకనే కలలలో నిలవగలిగినవాడు అతను. సంసారంలోకాక, వుత్త ప్రేమ బంధంలో నిలవగలిగిన మనుషులు చాలా సకృతుగా వుంటారని, వాళ్ళవి వేరే జన్మలని అతనికి తెలీదు. నిలిచివుంటే, ప్రేమబంధం చాలా త్వరలో సంసారం కావడమనేది చాలా సులభం, సరళమనేది తెలీదు. ప్రేమని సంసారం చేసుకునే గుణం మానవుల మనోతీరికలోనే ఉందని తెలీదు ఆనాడు అతనికి.

ఆ వెన్నెలలో దేవకన్య కావడం ఆమె పాత్రలలో ఒకటి. ప్రేక్షకుడు కావడం తన పాత్రలలో ఒకటి. వెన్నెల యింకి ప్రపంచంమీద సూర్యోదయం కావడంతోటే. భర్తని భక్తితోనో, భయంతోనో యెదురుచూసే భార్య ఆమె. తాను పాఠాలు తయారుచేసుకునే టీచరు. ఆ రాత్రి వేషాలు కడిగేసుకుని, పగటి వేషాలు ధరించకండా వుండగలిగే వరం మానవులకి ఏ

దేవతలూ యియ్యరు. పట్టుబట్టి రంగుల్ని కడక్కుండా వుంటే, పగలు రోడ్డుమీద నటించే నటకులగతే పడుతుంది వాళ్ళకి.

ఆమె తనతో వుంటేనా? ఇంకేం కావాలి. దినాలన్నీ ఆనందనృత్యం చెయ్యవా అనుకుంటున్నాడు. అన్ని ఆనందాలూ అందాలూ ఒలికే ఆమెలో తాను ప్రమత్తుడై, మధుపాన మత్తుడై గడపడా కాలం? స్త్రీ నిలుస్తుంది. ఆమెకి చాతనవుతుంది తిరిగి తిరిగి ప్రతి రాత్రికీ మధ్యాన్నానికీ శృంగారపాత్రని ధరించడం, కాని పురుషుడికి శాపం-ప్రేమ అతని హృదయంలో చాలా యిరుకు భాగం కావడం. తాను శృంగారంలో బలవంతంగా నిలిస్తే స్త్రీకే విముఖత్వం. సంసారం స్త్రీకి పంజర మయిందంటారుగాని శృంగారం పురుషుడికి పంజరమైనంతకాదు, ఎవరికో తప్ప. ఒక్కమాట నిజం, స్త్రీ హృదయంలో విలవని సంపాయించాలంటే, పురుషుడు తన బైట విలవని ఆమె హృదయంలో ప్రతిఫలింపచెయ్యాలి. సూటిగా పురుషుడికి ఆమెలో శాశ్వతమైన స్థానంలేదు. చివరికి శ్రీకృష్ణుడైనాసరే, యెంత మాయనాటక సూత్రధారి అయినాసరే, చక్రపాణి కాకపోతే, ఉత్త శృంగారమూర్తే అయితే, పదహారువేల స్త్రీలలో ఒక్కరి ఆలింగనం లోనూ అతనికి స్థానం లేదు.

పురుషుడి విలువ దుష్టత్వంలోనైనాసరే, ఆ దుష్టత్వంలో స్త్రీ తాను అయిక్యం కాగలగాలి. కాకపోతే అతన్ని శిష్టత్వానికి తిప్పడానికి యత్నించాలి. కాని యెన్నడూ తన ధర్మాన్ని మించి అలసటలో నిద్రపోకూడదు. జ్ఞానమున్న స్త్రీ, అదేమీ వీలుపడని స్త్రీలు కొందరు ఆ పురుషుడికి తల్లులై ప్రతి దినమూ క్షమించి వక్షానికి దగ్గిరిగా తీసుకోగలగుతారు.

శృంగారంలో నిలవమని స్త్రీ ప్రార్థిస్తే నిలవడానికి సంసిద్ధుడుకాని పురుషుడు పురుషుడుకాడు, కాని,

"లోకముతో మనకేటికే, లోలాక్షీ"

అని నాయకుడంటే ఆ మాటల్ని నాయకి నమ్మిందా, నా నాయకుడు చాలా త్వరలో,

"నీతో నాకేటికి లోలాక్షి"

అని నాయకి అతనికోసం ఒదిలిన లోకంలో మాయమౌతాడు. లోలాక్షాల్లోంచి కన్నీళ్ళు కారతాయని కూడా గమనించకండా.

ప్రేమా, భక్తీ, ఈ రెంటినీ ఆమెనించి తీసుకోగలిగిన పురుషుడిలో స్త్రీ అనంతంగా నిలవగలదు, ఇంక పిల్లల్ని తప్ప ఏమీ కోరకండా. ప్రేమా, శృంగారం తననించి తీసుకోగలిగిన స్త్రీలోనైనా పురుషుడు నిలువ లేడు. ఈ సంగతిని గమనించని ప్రియులు చాలా గట్టిదెబ్బ తింటారు జీవితంలో. కాని సూర్యారావుకి తెలీవు ఈ సంగతులు. స్త్రీకి చాలా సులభంగా, సూటిగా, సృష్టి యిచ్చిన మామూలు తెలివిలోంచే తెలుస్తాయి యీ సంగతులు. అంతమాత్రం తెలిసి పురుషుడు శృంగారంలో మాత్రమే నిలవకండా జాగ్రత్తపడని స్త్రీలో

స్త్రీత్వం చాలా తక్కువ. తానివ్వగల ఉత్సాహంలో పురుషుణ్ణి దైవత్వానికెత్తి, ప్రపంచానికిచ్చి, ప్రపంచపు విలువల వెలుగులో తన కళ్ళు మిరుమిట్లు గొలిపేట్టు తనలోకి తీసుకోడం స్త్రీ గొప్పతనం.

మర్నాడు సూర్యారావు

"గౌరీ, ఆమె నొక్కరాత్రి నా దగ్గిరికి తీసుకురాలేవా ?" అన్నాడు చాలా దీనంగా.

"చాలా కష్టం."

"కాని నువ్వు నాకాసహాయం చేసిపెట్టాలి, ఆ కృతజ్ఞతను యెన్నటికీ మరవను."

ఎన్నటికీ మరవడు. మరవకపోతే గౌరికేం వొలికింది!

కాని స్త్రీ సహాయపడేనాడు, కృతజ్ఞత అక్కర్లేకండానే సహాయపడుతుంది.

సాయంత్రానికి కబురు తెచ్చింది గౌరి. సూర్యారావు దొడ్డి తలుపు గొళ్ళెం తీసి వుంచాలి. ఆ గేదెవున్న సందులో పడుకోవాలి. రోహిణి వొస్తుంది ఆ రాత్రి అతని దగ్గిరికి.

"అదెందుకు? ఆ సందులో పడుకోడం?"

"ఆ మాత్రం తెలీదా. ఇంటివేపు వొస్తే ఆ భాగానికి కనపడదా ? ఆమెకి తెలీదు. నేనే చెప్పాను."

ఇంక కథ ఏముంది! కథల్లోనూ అంతే, జీవితంలోనూ అంతే. ప్రియుల్ని కలిపి, లేక పెళ్ళిచేసి, కథకుడు మర్యాదగా తప్పుకోవాలి. దంపతుల్ని ఆశీర్వదించి కలకాలం సుఖంగా వున్నారని మనకి అబద్ధం చెప్పి తను మాయం కావాలి. కాక ఇంకా రాసే అవివేకంలో పడ్డాడా ఆ ప్రణయదుష్ఫలితాల్ని వర్ణించవలసిన దుర్గతి పడుతుంది.

నా 1947 విమర్శకులకు జడిసి కథని ముగించలేని నా బలహీనం వల్లనే విశ్వనాధానికి అన్యాయం చెయ్యాల్సి వొచ్చింది. ఎందుకంటే విశ్వనాధం, ఇప్పుడు నువ్వు మిత్రుడివి కావు. నా పాత్రవి. నీకు కాదు. నా పాత్రకి చేస్తున్నాను అపకారం. ఎందుకంటే నా పాత్రలు నాకు చాలా అపకారం చేశారు. తమకి ప్రాణమిచ్చానన్న కృతజ్ఞత లేకుండా నా మీద ఎన్నో అపవాదులు వేశారు. తమని సమర్థించడానికేగద, తమమీద సానుభూతితోనే కద, నేనిన్ని నిందలకి పాల్పడ్డది?

రాత్రి పదింటికే వెన్నెలలో గేదెదగ్గిర చేరాడు సూర్యారావు. ఎందుకన్నా మంచిదని యింట్లో దీపం వెలిగించి తగ్గించి ఉంచాడు. తన చిన్న మంచం గేదె వెనక కాళ్ళ దగ్గిర వేసుకుని యిద్దరికీ అది సరిపోతుందా అని యోచించాడు. వెన్నెట్లో సిగ్గుపడదా! కాని చాలావరకు ఆమె వొళ్ళు తాను దూరాన్నించి చూడనే చూశాడు. ఆ మంచానికి గేదె కాళ్ళకింద తప్పచోటు లేదు ఆ చిన్న సందులో. ఇంటి ఆమె వొస్తుందేమోనన్న భయం ఉండనేఉంది. కాని యింతవరకు ఆమె అర్ధరాత్రులెప్పుడూ అటు పచారు చెయ్యలేదు.

తెల్లారకట్టవరకు భయంలేదు. అప్పటికి తన ప్రియురాలు ఉండనే ఉండదు. బ్రాహ్మణవీధి-అయిదింటికి ముందే మేలుకుంటుంది.

అరగంటలూ, గంటలూ జరుగుతున్నాయి మెల్లిగా. దోమలూ, పేడవాసనా, ఆ మంచమూ, మనిషి కొత్తగా వుంది గావును గేదెకి. తోకను అతని మీదనించి విసురుతో వుంటుంది. ఊరికే యిటూ అటూ తిరుగుతుంది. అరవదుకద!

పన్నెండు కొడుతున్నారు తాలూకా ఆఫీసులో. ఎంత గొప్ప స్థలం ప్రథమ సమాగమానికి!

పేడ గ్రహం ఏదో పనిచేస్తూ వుండాలి, తన జాతకంలో.

ఎంత కవిత్వంలేని మనిషికైనా, వెన్నెలా, యవ్వనం, ప్రియురాలికోసం నిరీక్షణా, కలలు కన్పించక మానవు. పేడ వాసనలోనైనా సరే! అందులో కవి అతను.

ఎట్లా వస్తుందో.....వొచ్చి యెట్లా భయంతో యిటూ అటూ చూస్తుందో, ఆయాస పడుతుందో, తనని చూసి చిరునవ్వు నవ్వుతుందో, ఏమడుగుతుందో! బొమ్మలు కట్టుకున్నాడు. ఆతృత యెక్కువయింది. ఇంకా రాలేదే! నిద్ర పోయిందేమో! ఇంకేం ఆశ. తెల్లారి యెంత దిగులు పడుతుందో!

ఏం చీరె కట్టుకుంటుందో! అత్తరు రాసుకుంటుందా? తాను పంపిన దవనం, చామంతి పువ్వులూ తలలో పెట్టుకుని వొస్తుంది.

తాను చూపిన వగలూ, లాలనలూ, నవ్వులూ, ఆ డాబామీద తాను చూసినవి, ఆ చిన్నెలన్నీ యీ పక్కమీద చూపగలదా. ఈ కాసేపట్లో! తనని పిలవడం, రొమ్ము దగ్గిరికి వొత్తుకోడం.....

అతని తొందర యెక్కువయింది.

రోడ్డుమీదికి వెడితే! తలుపు తట్టితే! అసలు చెడిపోతుందేమో! ఈవాళ కాకపోతే రేపు. కాని రేపు భర్త వొచ్చేస్తాడు. ఒకవేళ యివాళే వొచ్చాడేమో! ఈపాటికి తన చేతుల్లో బదులు-

ఎట్లా భరించడం!

రాదా? తన దగ్గిరికి రాదా? భర్త వెళ్ళడా ? వెళ్ళాక రాదా ! కాదు, యీ రాత్రే వొస్తుంది. తప్పదు. తన అదృష్టం తనని అంత అన్యాయం చెయ్యదు, వొస్తుంది. వొస్తే, వచ్చాక, తను యేమీ ప్రమత్తతలో వుండకూడదు. ముద్దులూ, ఆమెని అనుభవమూ. అన్నీ అట్టే వుంచాలి. వ్యవధిలేదు. మాట్లాడాలి. వెంటనే వొచ్చెమనాలి తనతో. ఆ రాత్రి అట్లానే వెళ్ళిపోవాలి తామిద్దరూ. మళ్ళీ మర్నాడు భర్త వస్తాడు. ఆ విశ్వాసబలం తానియ్యాలి తన మాటలతో, ముద్దులతో, ఆరాధనతో. ఈ సమయం తప్పిపోతే జీవితంలో రాదు అట్లాంటి అదృష్టం. కాని ఆమె రాదేమో! భర్త వచ్చాడేమో!

ఒక్క నిమిషంలో అంతా బాధామయమయింది. తనమీద తనకి జాలీ దిగులూ పుట్టాయి. గేదె తిరిగి తిరిగి అతన్ని వాసన చూస్తోంది. బుసలు కొడుతో. గేదా, నీ కిట్లాంటి బాధలు లేవుకదూ! వెన్నెల నిన్నేం చెయ్యలేదు! ఎంత అదృష్టం గేదో కావడం. దొంగ వేదనలు, పురాణం వాళ్ళు, మానవజన్మముత్తమము అని కీర్తిస్తారు దేవుణ్ణి. ఏమిటా మానవజన్మలో శ్రేష్ఠం! కాని ఆమె వస్తే-శ్రేష్ఠం కాదా మరి. గేదెకి అట్లాంటి సుఖం వుంటుందా? దున్నపోతుకి గేదెతో వయ్యారాలూ, కళ్ళ తళతళలూ, కావిలింతలూ, పెదిమలమీది ముద్దులూ తెలుస్తాయా? కాని ఆ అదృష్టం పట్టినప్పుడు కదు! ఈ లోపున గేదా, నువ్వు చాలా అదృష్టవంతురాలివి.

మూడు గంటలు.

ఇంక ఆశలేదు నిద్రన్నారాదు. దోమలు....

ఇంక ఇంట్లోకి పోతే! పోయి....

తన తలుపు తెరిచిన చప్పుడు - కాని తలుపు తెరిచే వుంచాడేం అడుగు చప్పుళ్ళు. ఒక్క దూకుని సందు మలుపు తిరిగాడు. అతని యింటోంచి గబగబ వస్తోంది రోహిణి. గంధం. దవనం పరిమళం, జరీ అంచు తెల్లచీరె. ఎదురుగా వెళ్ళి కావిలించుకున్నాడు. వేగంగా వెళ్ళే ఆమె అతని రొమ్ముమీద పడ్డది. గట్టిగా కావిలించుకోబోతున్నాడు. అంతా అర నిమిషం పట్టలేదు అతని వెనక అరుపు. ఆమె అతన్ని ఒక తోపుతోసి తలుపులోంచి వెళ్ళిపోయింది. తరువాత సంగతి అతనికేమిటో అంతా అగమ్యగోచరం. సరిగా అర్థంకాలేదు. ఈనాటికీ కాలేదు.

ఆ యింటి ఆమె అరుస్తోంది. "లంజ, లంజ, నెలనించి చూస్తున్నాను.....దాని వేషాలూ .....యీ యింటో....మర్యాదుస్తుడని, ఉద్యోగస్తుడని....పొమ్మనండి....యింటోంచి.... పొమ్మనండి...."

లేస్తున్నారు మనుషులు యిరుగు పొరుగువాళ్ళు ఆవలిస్తో, ఒళ్ళు విరుచుకుంటో, గుమిగూడుతున్నారు. ఏమిటంటున్నారు, ఎదరింటి గుమ్మం తెరుచుకుని, ప్లీడరుగారు..... ఆ వెన్నెట్లో.

సూర్యారావు యింకా రొమ్ములో పరవశత్వం అనుభవిస్తోనుంచున్నాడు కదలకండా ....తన యింటోంచి చప్పున యెవరో దూకారు ఆకూడే గుంపులోకి....వెళ్లెవరూ గమనించకండా ...విశ్వనాథం! వెన్నెట్లో మెరిసింది ముక్కుపోగు.... తన యింటోంచి. రాత్రి అక్కడే వున్నాడు. రోహిణీ అక్కడే ఉంది. తాను అంతసేపూ గేదె కాళ్ళకింద విరహపడుతున్నాడు. ఘోరం....అన్యాయం....తనని ప్రశ్నిస్తున్నారు మనుషులు. ఇంకా అరుస్తోంది యింటామె కసితీరా. ఇన్ని నెలల కసీ మండిపోతో, మాటల్ని కాలుస్తో. తన్నేమన్నా మాటాడాలి కావును. ప్లీడరు అడుగుతున్నాడు తనని "ఏమిటండీ యిది?" అని. ఇంటావిడ అవతల గుమ్మంలోంచి, "అడగండి, మీ మరదల్ని కనుక్కోండి" అంటోంది తన

ఇంటిసొమ్ముని, తన హక్కుని ఆయన మరదలు ఆ రాత్రి దొంగిలించిందని. విశ్వనాథం మెల్లిగా జారుకుంటున్నాడు. సూర్యారావుకి తానేం జవాబు చెప్పాడో ఏమిటో జ్ఞాపకం లేదు. ఏమీ అర్థంకావటం లేదు. తన నెందుకు అడుగుతున్నారు? తనకేం తెలుసును? విశ్వనాథాన్ని అడగరేం?

ఎట్లా సద్దుమణిగిందో అణిగింది. ఆ యింటాయన మాత్రం, మాటలేని ఆయన, తన భార్యకి పిల్ల నివ్వలేని ఆయన మాత్రం,

"ఇల్లు సాయింత్రానికి ఖాళీ చెయ్యండి" అని వెళ్ళిపోయినాడు.

ఎండ వొచ్చింది అతనింకా ఇంటోనే కూచుని వున్నాడు. దీపం వెలుగుతూనే వుంది.

విశ్వనాథం తన యింటికి ఎట్లా వచ్చాడు? రోహిణివస్తుందని అతనికెట్లా తెలిసింది?

అడుగుదామంటే గౌరీ రానేలేదు, ఎన్నడూ రాకండా వుండని గౌరి.

అన్యాయంగా ఈ నింద అంతా తనమీద పడ్డది. అన్యాయం ఏముంది? తనకు అందలేదు గాని అందితే తానూ అంతటివాడు కాడా ? అన్నంత ఆలోచన ఇంకాలేదు సూర్యారావుకి, ఆనాడు, ఆ గోలలో.

పొద్దున్నకి రాత్రి అరుపులు గుసగుసల్లోకి ఇంకినట్టున్నాయి. అతను రోడ్డుమీదికి వెళ్ళినప్పుడూ, హొటల్లోనూ ప్రతివారూ తనమీద అర్థయుక్తంగా తనవంక చూస్తూన్నట్టూ, తనకి వినపడకండా మాట్లాడు కుంటున్నట్టూ తోచింది. అట్లాంటి చిన్నవూళ్లో చప్పున పాకిపోతాయి ఏ చిన్న సంగతులూ. రోహిణిని తలుచుకుని దిగులు వేసింది.

బడికి వెళ్ళగానే విశ్వనాథంకోసం చూశాడు. అతను బడికిరాలేదు. అతని మామగారికి అకస్మాత్తుగా జబ్బుచేస్తే వారంరోజులు శెలవుపెట్టి వూరికి వెళ్ళాట్ట.

విశ్వనాథంమీద కోపంమొచ్చింది. ఇట్లాంటి స్థితిలో తనని ఒంటరిగా వొదిలి వెళ్ళాడా, చేసిన మిత్రద్రోహంచేసీ! అతను చేసిన పనిలో మహామిత్రద్రోహ మేముంది? రోహిణి అతనిమీద ఇష్టపడ్డదేమో అనే ఆలోచన రాలేదు అతనికి.

వెంకటసుబ్బయ్యకీ జాషూవాకీ సంగతంతా తెలిసింది. తమ సంగతి ఎక్కడ బైటికి వొస్తుందోనన్న భయం వాళ్ళ మొహాల్లో. సూర్యారావుకి ఈ వ్యవహారంమంతా చాలా గొడవగా, చీదరగా వుంది. తనకి వొలికింది ఏమీలేదు. తాను చేసిందీ ఏమీలేదు. పైగా యింత గొడవ, వాళ్ళిద్దరికీ తనతో మాట్లాడ్డానికి చోటివ్వలేదు అతను.

హెడ్మాష్టరు కబురు పంపాడు అతనికోసం.

"ఏమిటండీ ఈ గొడవ...." అంటున్నాడు.

ఇంకోడైతే,

"నిజం చెబుతున్నా. దేవుడిమీద ఒట్టు. నాకేం తెలీదు. రామరామ! ఏం తెలీదు" అని ప్రారభించేవాడే.

"అదంతా సరేలెండి." అన్నాడు సూర్యారావు.

"మీరు ఇట్లాంటి పనిచేస్తారని నేను."

"ఆపేయ్యండి. మీరూ అనుకోలేదు. నేనూ అనుకోలేదు, మా అమ్మా అనుకోలేదు. నేను మొగాణ్ణని, అదంతా ఎందుకుగాని ఇప్పుడు అసలు మీకు పట్టిన ఇబ్బందేదన్నా వుంటే అది కానీండి" అన్నాడు.

హెడ్మాస్టరుకి అదేం బాగాలేదు. నీతిమీదా, మర్యాదమీదా, తన ఘనత సంగతీ, సూర్యారావు అవినీతి సంగతీ ఒక ఉపన్యాసమిచ్చి, ఇన్నాళ్ళూ మెడలు విరుచుకుని నాలుగింటికే వెళ్ళిపోయి తనని నిస్సహాయుణ్ణి చేసిన కసి కొంత తీర్చుకొందామనుకున్నాడు. బడిపని సాయింత్రాలు కూడా చేసి తనవంటి పెద్దల స్నేహంలో కాలం గడపని యువకులకి యిట్లాఒంటి దుర్గతులే లోకంలో రాసివున్నాయని పర్యవసానం తేల్చి, సూర్యారావుని పశ్చాత్తపపడచేసి, తన ధర్మపక్షాల కిందికి బానిసగా తీసుకుందామనుకున్నాడు.

సూర్యారావు యిట్లా యెదురు తిరిగేప్పటికి, ఆ నిమిషాని కానిమిషం కొత్త మార్గంలోకి దిగాల్సి వచ్చింది అనవసరంగా, ఆ హెడ్మాస్టరు.

"చాలా చెడ్డపేరు వూళ్ళో. మీకు సరే, నాకూ, బడికీ కూడా. ఇట్లాంటి ఉపాధ్యాయులు వుంటే, బళ్ళో క్రమశిక్షణకీ."

సూర్యారావుకి ఆ మాటలతో మనసు నించి పెద్ద బరువు ఒదిలి పోయినట్టుంది.

"సరేలెండి" అని లేచిపోయి, మూడునెలల సెలవకాయితం రాసి హెడ్మాస్టరుకి యిచ్చేసి వెళ్ళిపోయినాడు.

ఇంక ఆ వూళ్లో అతనికి వుండటం కష్టం. స్నేహితులూ, రోహిణీ ఆ సాయింత్రాలు.... నిన్న రాత్రేమైతేనేం, చాలా శృంగారమైన కాలం అనుభవించాడు. ఇంక నిలవలేడు ఆ వూళ్లో.

రాత్రి వెన్నెల మళ్ళీ. అదే దొడ్డి స్మశానం లాగుంది ఈ రాత్రి. రాత్రి పదయింది. బండిని ఒంటిగంట రైలుకి రమ్మన్నాడు. తన సామాను సద్దుకుంటున్నాడు.

నిన్నరాత్రి ఆ పాటికే గొప్ప ఆశలతో, కలలతో గేదె కాళ్ళసందున వున్నాడు. గౌరి కనపడలేదు, ఆ సాయంత్రమైనా.

అవును. చాలా గొప్ప శృంగార కాలం అనుభవించాడు. కాని నిన్న రాత్రి యేం జరిగిందో తనకు తెలీలేదు. ఎన్నడూ యింక తెలీదు. ఎప్పుడైనా - విశ్వనాథం తనకి కనపడి నిజం చెప్పితే తప్ప. అదంతా! విశ్వనాథం కుట్రా! రోహిణా! గౌరా! కావలసి తన నా సందులోకి పంపారా?

రోహిణి యేం చేస్తోందో? భర్త వొచ్చి వుంటాడు. అతనికి తెలీనీదు యీ సంగతి. తాను జ్ఞాపకం వుంటాడా ఆమెకి? కాని తనమీద వుందా ఆమెకి అసలు?

పన్నెండయింది. కోటు వేసుకున్నాడు. బండివాడు వొస్తాడా ? పాపం! గౌరి వాంఛ తీరనేలేదు. తాను యెండమావులవంక చూస్తో.......అతనికి అతనిమీద చాలా జాలివేసంది. ఏడుపు వొచ్చింది.

తలని చేతుల్లో పెట్టుకుని యేడుస్తున్నాడు. అలాంటి గొప్ప నిరాశాసమయాల్లోనే మనుషులమీద చాలాసార్లు విధీ, కథకులూ, ఇద్దరూ కనికరిస్తారు. నిలవలేనంత జాలి పుడుతుంది. వాళ్ళకీ యేడుపొస్తుంది. ముఖ్యం యవ్వనులమీద.

అతని తలమీద దయగలచెయ్యి. చేతి వెనక పరిమళాలు, తలయెత్తాడు. గౌరి!

వొస్తుంది దయ, విధికి, కథకుడికీ. కాని చాలా వింత విధాల వొస్తుంది దయ.

చీకట్లో మొదటి రోహిణే ననుకున్నాడు. కాని గౌరి.

అదే మొదటిసారి గౌరి అతన్ని తాకడం.

కాని అతనికి కోపంగా వుంది గౌరిమీద.

“ఏం యిప్పుడు దయచేశావు? జీతానికా?''

“విన్నాను, వెళ్ళిపోతున్నారని. చూడ్డానికి వచ్చాను,”

“ఏమైనావు యివాళ అంతా?''

“తన్నాడు, లేవలేకపోయినాను.''

“ఎందుకు?''

“అడుగుతారేం? ఈ గోలకీ.”

కోపం భగ్గుమంది.

“ఇంత ద్రోహం నువ్వేనా చేసింది? లంచం తిన్నావా?''

అని ఆమె గొంతు పట్టుకున్నాడు.

ఆమె ద్రోహం చేసిందో లేదోగాని, తను ఆమెకి చేసిన ద్రోహం, చాలా స్వార్థంతో, నిర్దయతో ఆమెని కాలికింద నలిపిన సంగతి గుర్తురాదు అతనికి. వుత్తదాసి.

కంఠం గట్టిగా నొక్కాడు. ఆమె యేడ్చి అతనిమీద ఒరిగింది. తరవాత సంగతి అతనికి తెలీదు. గౌరి చేతుల్లో అలిసి ఆమెకేసి చూస్తో వున్న నిమిషంవరకు, బైటనించి ప్రతిఫలించే మెత్తని వెన్నెట్లో.

ఆకస్మాత్తుగా గౌరిలో యెందుకైనాడు అతను అట్లా? అంతే ఉధృతమైన యవ్వనం. ఇంకా ప్రతి పనికీ కారణం చెప్పుకోగలిగిన స్థిరమూ, వయసూ రాలేదు అతనికి. ముందు

వెనుకలు ఆలోచించి జాగ్రత్తగా పనులు తూచిచేసే నిర్జీవత్వం యింకా పట్టలేదు అతనికి. అతని రోషమూ, విఫలమనోరథమూ, తెలీకండానే అతనిలో ప్రజ్వలిస్తున్న రోహిణి మీది ద్వేషమూ కారణాలని సైకాలజీ ప్రకారం చెప్పుకోవాలి.

మొత్తానికి శృంగార కార్యంతో అతని రక్తం చల్లపడ్డది. మనసుకు శాంతి వచ్చింది. మధ్యలోవచ్చి కేకేసినబండి మనిషిని తెల్లవారి రైలుకి రమ్మని కేకేసి పంపించేశాడు.

ఒక్కమాట లేకండా గౌరి వెళ్ళిపోయింది. ఇట్లాంటి ఇన్‌ట్యూయిటివ్ వివేకం ప్రతి స్త్రీకీ యెక్కువ: జ్ఞానవంతులైన పురుషులకన్నా కూడా. ముఖ్యం చదువురాని స్త్రీలకి. ఎట్లాగో తెలుసును గావును ఆమెకి, అతన్ని తనలోకి తీసుకొచ్చిన శక్తి తనమీదీ ప్రేమ కాదని.

అతనికి తెలీకండానే వెళ్ళిపోయింది గౌరి.

అతని ఉధృతం, కళ్ళు కనపడకపోవడం, ఆ రోషం, తన ఒంటిని అట్లా గట్టిగా వేళ్ళతో నలపడం, ఇదీ ఒక విధమైన గొంతు నులమడమేననిపించింది గౌరికి. ఏమైతేనేం, గౌరికి చాలా తృప్తినీ శరీరసుఖాన్నీ యిచ్చింది అతని కలయిక.

మనోరథాలు సఫలమయ్యేందుకు అనేకమైన వింత విధాలు కామ ప్రపంచంలో.

ఈ అనుభవం, సూర్యారావువంటి పురుషుడి చేతుల్లో నలిగిపోవడం తన మెళ్ళో బంగారుపట్టెడ కన్న, తన పుట్టింటివారు ఎన్నడో పెట్టిన ఒక్క కొర్నాటి చీరెకన్న విలువగా దాచుకుంటుంది. ప్రేమ జీవితం ఆమెని ఏ క్రూర మార్గాల నడిపినా, ఈనాటి ఆ కడ్డీవంటి శరీరాన్ని ఏయే ముతకరొమ్ములు దగ్గిరిగా వత్తుకున్నా, ఈ కలలోకి సులభంగా గర్వంగా వెళ్ళిపోగలుగుతుంది. మనసులో "ఒకనాడు నన్ను గొప్ప ఆశ్వీజపు వెన్నెల రాత్రి నన్ను ఆ ఇంటోనే...." అని ఆ ప్రియుడితో చెప్తున్నట్టే తనతో చెప్పుకోగలుగుతుంది, అంతే చాలు గౌరికి.

అతనికి తెలీకండానే వెళ్ళిపోయింది గౌరి.

సూర్యారావు అట్లా కుర్చీలో నిద్రపోయినట్టున్నాడు. తాను వెన్నెట్లో మెట్లమీద కూచుని వున్నాడు. ఎదురుగా గోడమీద రోహిణి తనని పిలుస్తోంది. ఎట్లారాను? అంటున్నాడతను. తానే వస్తానంది. వెన్నెట్లో తేలుతో మేడమీదనించి గాలిలో నిలిచింది తన ముందు వచ్చి. ఈ లోపలే తను నిద్రపోతున్నాడు. తనని, జుట్టులో వేళ్ళు పోనిచ్చి, లేపుతోంది. కళ్ళు తెరిచి చూశాడు. ఆమె ముఖంలో నవ్వులేదు. నిదానంగా, జాలిగా అతనికేసి చూస్తోంది. ఒళ్ళు పులకరించింది.

నిజంగా కళ్ళు తెరిచాడు. రోహిణి తన జుట్టులో వేళ్ళు పోనిచ్చిలేపుతోంది. కిటికీలోంచి వెన్నెల ఆమె నడుంవరకు పడుతోంది. ఆమె నవ్వటంలేదు. నిదానంగా అతనికేసి చూస్తోంది. అతని ఒళ్ళు పులకరించింది.

చివ్వున లేచి ఆమెని కావిలించుకున్నాడు. చేతుల్లో మామూలు వేడి లేదు అతనికి.

"ఇప్పుడా, ఇప్పుడా!" అని అరిచాడు లోలోపల.

"ఇప్పుడా! చివరికి?" అన్నాడు పైకి.

ఆమె ఏమిటో చెప్పబోతోంది. కాని ఏమీ వ్యవధి నియ్యలేదు ఆమెకి. గట్టిగా వూపిరాడకండా తీసుకున్నాడు ఆమెని. యవ్వనానికి ఒక్కరాత్రిలోనే ఇలాంటి సంగతులు ఓ లక్ష్యంకావు. పైగా పెళ్ళి కాలేదు అతనికి. అవునా రంగారావుగారూ!

"నువ్వు వెళ్ళడానికి వీల్లేదు. వచ్చెయ్యి నాతో." అంటున్నాడు ఆమె పెదవుల మధ్య. కాని, నిద్రా, అలసటా....ఆ మాటలతో బలం వినపడలేదు ఆమెకిగాని, అతనికిగాని.

"అసలు వచ్చేదాన్ని కాదు. నామూలాన మీరుపడ్డ అపనిందకి జాలిపడి వచ్చాను."

ఆ మాటల్లోనే అవమానం తెలీదు అతనికి ఆ నిమిషాన.

అప్పుడు మెల్లిగా జ్ఞాపకం వస్తున్నాయి సంగతులు.

"నిన్ను మీ వాళ్ళు చాలా బాధించారా?"

"అందుకనే మీ మీద ఇష్టం అనుకుంటాను నాకు." అంది రోహిణి అతని గడ్డం ఎత్తి కళ్ళల్లోకి చూస్తూ.

"ఎందుకు?"

"మాటలకి వ్యవధిలేదు. వెడతాను"

"వుండు వుండు. వీల్లేదు. ఎట్లా వచ్చావు ? ఎంత ధైర్యం? అల్లరై...."

"ఆయన వొచ్చారు. అదీ రక్షణ నాకు. పైగా...."

తక్కిన మాటలు వినడంలేదు సూర్యారావు.

భర్త పక్కలోంచి లేచి వచ్చిందా తన దగ్గిరికి!

ఎవరిని కావిలించుకున్న చేతులతో తాను ఆమెని తీసుకున్నాడో రానేలేదు అతని మనసుకి!

"పైగా నిన్నరాత్రి అంత అల్లరైన తరవాత యివాళ యెవరూ అనుమానపడరు."

చాలా పాత చెయ్యి ! ! !

స్త్రీ జ్ఞానం లోకానుభవం మాట్లాడిందా, అట్లాంటి అనుమానాలు పురుషుడికి. అందువల్లనే బుద్ధిహీనురాలుగా నటిస్తుంది పతివ్రత. నిజమైన పతివ్రతలు యిట్లానే నిజంగా బుద్ధిహీనులౌతారు కొన్నేళ్ళకి!

"నిన్నరాత్రి సంగతేమిటి?"

"ఎందుకులెద్దురూ అదంతా."

ఆమె ఆ సంగతి మాట్లాడదని తెలుస్తోంది అతనికి. గట్టిగా ఆమెని అడగవలసిన అగత్యం, వోపికా లేవు అతనికి యీనాడు. కాని నిన్నరాత్రి ఈమె విశ్వనాథం చేతుల్లో యిట్లానే! నిజంకాదు. ఏమో ! నిజం కాదేమో!

"వెడతాను" అని లేచింది.

"వద్దు, నాతో వచ్చెయి"

పకపక నవ్వింది.

"వచ్చెయ్యనా ! భర్తకనక, ప్రియులముందు నాట్యమాడాను. ప్రియుడు రమ్మంటాడు తనవెంట. వెడతాను, ప్రియుడుగనక, ఎవరిముందు నాట్యమాడను? నాట్యమాడనిస్తావా, బాబూ! భర్తని భరించడం సులభం ప్రియుడి కళ్ళు కప్పడం కష్టం. ఎందుకంటే ప్రియుడికి చాలా అనుమానం. భర్తని వంచన చేసివొచ్చిన స్త్రీ అని. వెర్రివాడా! అందుకనే అంత యిష్టం మీమీద.

"నిన్నరాత్రి గొడవకి మీ వాళ్ళు నిన్ను...."

"పిచ్చి తండ్రీ, నా మీద గొడవ వదలదుకదా మీ మనసునించి! ఎంత మంచివారండీ! ఏమౌతారో యీ ఆడవాళ్ళ చేతుల్లో యింత వెర్రివారు. వస్తాయి యిబ్బందులు. కొంచెం స్వేచ్ఛకోసం గాలికోసం ఆడది దిక్కులు చూసిందంటే, తప్పవు కష్టాలు. ఏదో వస్తాయి - పోతాయి. అంతేగాని ప్రతీదీ యింత ప్రాముఖ్యంగా ఆలోచిస్తే జీవితమంతా బాధలే. తేలికగా తీసుకోవాలి సంగతులు. రెండు తిడతారు. తంతారు. ఇంతలోనేం? వెడతానేం?"

"వుండు, వుండు, ఒక్క నిమిషం"

వొదలలేడు ఆమెని, ఆమె పైని సగం పడుకుని వెన్నెట్లో ఆమె కళ్ళకేసి చూస్తో జుట్టుని ఇటూ అటూ సద్దుతున్నాడు. ఆమె పెదిమల్ని మళ్ళీ మళ్ళీ ముద్దు పెట్టుకున్నాడు. ఆమె గొంతుకలో పిల్లిలోంచి మల్లే ఏవో తృప్తి ధ్వనులు. మెల్లిగా అతని మెడపైనించి చెయ్యేసి మొహాన్ని రొమ్ము దగ్గిరిగా లాక్కుని అతని జుట్టులో-

"కోడికూసేతలికి కొంపకెళ్ళాలి.

నీ కోసరమె చెపుతాను...." అంటోంది.

ఆమెకి తాను తెచ్చే ఆపద జ్ఞాపకం వచ్చి, ఒక్కసారి ఆమెని ఒంటి అంతటితోనూ దగ్గిరిగా తీసుకుని తాగాడు.

"వదల్లేను, నిన్ను వదల్లేను....వెళ్ళకు.... పోనీ, ఒక్క రవ్వసేపు వుండు...." అతనికి బాగా తెలుసు ఇంక జన్మకి అంతటి గొప్ప నిమిషాలు, మానవమాత్రుడికి, తనకి రావని.

అంటో ఆమె రొమ్ముమీద ముద్దు పెట్టుకుంటూనే ఉన్నాడు. అతని చేతులు ఆమె బుజాలకింద వుండనే ఉన్నాయి. అతనికి తెలియకుండానే పాములాగు ఆమె మెలికలు తిరిగి పాదరసంవలె, అదృష్టంవలె జారిపోయింది చీకట్లోంచి, బైట వెన్నెలలోకి, అడుగు చప్పుడైనా అతనికి వినపడకుండా.

అట్లా జారగల స్త్రీని ఓసారి చేతుల్లో ఒత్తుకున్నాడా ఇంక జన్మకి ఆ ఆశనించి తప్పించుకోలేడు మానవుడు. కాని అట్లాంటి అనుభవం ఒక్కసారికన్న కటాక్షించరు యీ మట్టిభూమిమీద తిరిగే మానవులకి.

నిజంగానే వదలలేడు ఆమెని. ఎన్నటికీ వదలలేడు. వదలకపోతే, ఎన్నాళ్ళకైనాసరే, వొదిలిందాకా శాంతినవ్వదు! "అబ్బా, ఎప్పుడు వొదిలిపోతుందో యీ పిశాచి!" అనుకుంటో వొదలలేడు మానవుడు.

భర్తా?-భర్తకి ఆమె భార్య. అంతకన్న యెన్నడూ తెలీనీదు భర్తకి. ఆమె శృంగారమే మరుగు అతని కళ్ళనించి, అతనిమీద జాలివల్ల, అన్నిటికీ తనకి అతననే కృతజ్ఞతవల్ల.

వెనక్కి వచ్చి గుమ్మంలో నుంచుంది అతని రక్షణదేవత మల్లే.

"చూడు, గట్టిగా లోపలికి తీసుకోకండి సంగతుల్ని. అట్లాంటి మనుషులకి శాంతి శూన్యం" అని గదిని శూన్యంచేసి వెళ్ళిపోయింది వెన్నెట్లోకి, వెన్నెట్లోంచి తన పంజరంలోకి.

"సినిక్సు" బట్ట తీసేస్తే ఏ స్త్రీ అయినా ఒకటేనంటారు దౌర్భాగ్యులు. అందరు స్త్రీలూ ఒకటే కావచ్చు. పురుషుల అహంభావాల్ని వొంచి నలిపి, తమచేతి వేలును తాకడంకన్న, తమ చిరునవ్వుని దగ్గిరిగా ముద్దుపెట్టుకోడం కన్న ఘనత ప్రపంచంలో రాజ్యాలు గెలిచినా, దేశ స్వేచ్ఛని తెచ్చిపెట్టినా, మానవాతీతుడనే కీర్తిని పొందినా, అపార జ్ఞానసంపన్నుడైనా. ఇవన్నీ తమ పాదాల ఆరాధనకి తులతూగవని తిరిగి తిరిగి పురుషప్రపంచానికి తలవొంపులు చెయ్యడానికే రోహిణివంటి స్త్రీలలో "యుగే యుగే" అవతార మెత్తుతుంది రతీదేవి, శృంగారం సంసారం మలినభూయిష్టమైన చీకటి కాలాలలో. ఆ స్త్రీలు మాత్రం వేరు.

ఏ తపస్సువల్లనన్నా ఏమైనా సాధించగలడుగాని మానవుడు, ఈ దివ్య స్త్రీల అనుగ్రహం ప్రత్యేకంగా నిర్వ్యాజమైన వరం. ఏ గొప్ప దశలు పట్టిన జాతకులకో, అదీ ఏ ఒక్క రాత్రికో, తక్కిన జీవితాన్నంతా భస్మం చేసే యీ అపారానుగ్రహం దొరుకుతుంది.

సౌందర్యమే అపురూపం లోకంలో. ఆ సౌందర్యం దయతలచి శృంగార రూపాన జన్మని వెలిగించి కాల్చివెయ్యడం చాలా దుర్లభం.

◆ ◆ ◆

*రచనాకాలం : 1947*

*ప్రచురణ : (హంపీకన్యలు) ఎమెస్కో ప్రచురణ, 1969*